ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మే 3, 2009




నాకు స్ఫూర్తినిచ్చిన పుస్తకం

కథ నిలయం
శ్రీకాకుళం
కథ
39294

# మధురఫలం

# హ్యాపీ బర్త్‌డే

(2009 మే 3 నుంచి
2009 మే 9 వరకు)

దుర్గా సంపత్‌కుమార్
మే-3
సత్యవతి-సత్యనారాయణ
జిందాల్-విజయనగరం

నిఖత్ ఖాతూన్
మే-3
షమీమున్నిసా -ముక్తార్ అహ్మద్
మౌలాలి-హైదరాబాద్

కె.సిద్దార్థ
6సం॥,మే-5
అనురాధ -వెంకటేష్
నల్లగొండ

డి.వర్షిణి
2సం॥, మే-7
నిర్మల -శ్రీనివాసరావు
తిరువూరు -కృష్ణా

వి.శ్రావణి
7సం॥, మే-9
కోటమ్మ -వేంకటరంగయ్య
కంభం-ప్రకాశం

వి.మణికంఠ
4సం॥, మే -9
కోటమ్మ -వేంకటరంగయ్య
కంభం -ప్రకాశం

జి.కోటేష్
2సం॥, మే -4
సుజాత -సురేష్ కుమార్
సీతారాంపురం -ఖమ్మం

కె.వెంకట్
2సం॥, మే-2007
మహాలక్ష్మి -వెంకటేశ్వర్లు
మార్కాపురం-ప్రకాశం

ఎం.రూతు(బుజ్జి)
7సం॥, మే -9
అనిత -డేవిడ్ రాజ్
అగనంపూడి- విశాఖపట్నం

హర్షిణి
1సం॥, మే -9
కరుణ - ఖన్నా
సికింద్రాబాద్

ఎం. జానకి
2సం॥,మే -6
సునీత -రాజు
చిక్కడపల్లి-హైదరాబాద్

కీర్తన
6సం॥,మే -2003
వందన-నగేష్
ఫతేనగర్-హైదరాబాద్

సాయిపూజిత
మే
సూర్యకళ-శ్రీను
జిందాల్-విజయనగరం

మనలో మాట

# హ్యాపీ డేస్...

కథా నిలయం
శ్రీకాకుళం



వేసవి సెలవులు వచ్చేశాయ్!

అందుకనే- ఎండలు మండిపోతున్నా ఇంటా బయటా ఇంత సందడి!

హడావిడి జీవితంలో ఆటవిడుపు సెలవు.

సెలవులతో పిల్లలు పిల్లల్లా మారతారు. ఆటపాటలతో పరిమళిస్తారు. తాతయ్యా అమ్మమ్మల ఆప్యాయతలతో పరవశిస్తారు. హోం వర్కులూ, టార్గెట్లూ లేని ఓ వసంతకాలం ఇది!

సెలవులకోసం పిల్లలే కాదు, పెద్దలూ ఎదురుచూస్తారు. ముఖ్యంగా పట్టణాలనుంచి వచ్చే మనవళ్లకోసం పల్లెటూళ్లు ప్రేమతో నిరీక్షిస్తాయి. ప్రతి వేసవిలోనూ పెద్దలు పసిపిల్లలవుతారు. పిల్లలతో కలిసి తమ బాల్యంలోకి తొంగిచూస్తారు.

పిల్లల ఆనందాలకు నెలవులయ్యే సెలవులు పట్టణాల్లో 'శిక్షణా కేంద్రాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు పల్లెటూరి విహారంలో చాలా సాధారణంగా అభ్యాసమయ్యే విద్యలు ఇప్పుడు భారీ ఫీజులతో సరికొత్త రూపం ధరించాయి.

సెలవులొస్తే బాధపడేవాళ్లూ, భయపడేవాళ్లూ ఉంటారు. తిరుపతి, హైదరాబాద్, విశాఖపట్నం లాంటి మహానగరవాసులకు బంధుతాకిడి ఎక్కువగా ఉంటుంది. అనుకోని అతిథులొస్తే- వారి తిప్పలు అన్నీ ఇన్నీ కావు. ఈ విషయంలో పల్లెటూళ్లు అమ్మలాంటివి. ఆహ్వానించడం, ఆదరించడమే కానీ అసౌకర్యంగా ఫీలవ్వవు.

ఇప్పుడు కొంతమంది రాజకీయ నాయకులకూ హాలిడే ట్రిప్పులు మొదలయ్యాయి. మంద చెదరకూడదనేది అధినేత ఆలోచనైతే- ఉచిత విహారం దొరికిందిలే అన్న ఆనందం ఆ నాయకులది. త్వరలో 'పొలిటికల్ సమ్మర్ క్యాంపులు' కూడా మొదలవుతాయి. ఇక సెలవులొస్తే ఆర్టీసీ, రైల్వే వాళ్లు చాలా ఆనందపడతారు. బస్సులూ రైళ్లూ జనంతో కళకళ్లాడుతుంటే- వాళ్ల ఖాతాలు ధనంతో గలగల్లాడతాయి.

అన్ని ఆఫీసుల్లోనూ ఈ వేసవిలో సెలవులెక్కువవుతాయి. ఎడ్జస్టుమెంటు చేయడం బాసులకు పెద్ద తలనొప్పి. కానీ, సెలవు ఇస్తామంటే- ససేమిరా తీసుకోమనే బాపతూ కొందరుంటారు. ఇందులో రాజకీయ నాయకులది ముందు వరస! బహుశా వారు 'తీసుకోము' అని చెప్పే ఏకైక సందర్భం ఇదేనేమో! 'మాకు సెలవు ఇవ్వొద్దు. సదా మీ సేవలో తరిస్తాం' అని మొన్నటి ఎన్నికల్లో మైకు పగిలేలా మొరపెట్టుకున్నారు. వాళ్లకు సెలవు ఇవ్వాలా? వద్దా? అన్నది ఓటరు జడ్జి ఇప్పటికే నిర్ణయించేశాడు. ఆ తీర్పేమిటో మే 16న తేలుతుంది. అంతవరకూ మనకు హ్యాపీ హాలిడేస్... వారికి వట్టి సమ్మర్ డేస్!! ★

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| స్ఫూర్తి | ... | 4 |
| సీరియల్ | ... | 6 |
| ఆరోగ్యం | ... | 10 |
| కవిత్వమ్ | ... | 11 |
| బాల నేస్తాలు | ... | 12 |
| అట్టమీది కథ | ... | 14 |
| రుచి | ... | 19 |
| కూల్‌కూల్‌గా | ... | 22 |
| కొత్త పుస్తకాలు | ... | 24 |


## ఇంకా...

తెల్సా ...3
అతి పెద్ద మామిడి చెట్టు

కథ ...8
దృష్టి

న్యాయ సలహాలు ... 18



చూద్దామా ... 20
అలనాటి మహావిద్యాలయం నలంద



## చల్లబరిచిన హిమక్రీములు

ఏప్రిల్ 19 నాటి స్నేహలో వచ్చిన కథ మా ఇంట్లో అందరికీ నచ్చింది. వేసవిలో కూల్‌కూల్‌గా హిమక్రీములు అందించినందుకు సంతోషం. కూరగాయలతో ప్రాణులు మమ్మల్నందర్నీ ఎంతగానో ఆకట్టుకున్నాయ్. ప్రతీవారం మనలోమాట వాస్తవాల్ని తెలియ జేస్తోంది. శ్రీశ్రీ కథల పరిచయం బావుంది. బాల నేస్తాల్లో బీర్బల్ కథలు పిల్లలను కదిలించకుండా ఆసాంతం చదివిస్తున్నాయి.

**వి. భాస్కరరావు, వినుకొండ.**

## స్విస్ బ్యాంక్ భాగోతం

## చక్కగా చెప్పారు

**19-4-09** నాటి స్నేహ సంచిక అట్టమీది కథ ద్వారా గుడిపూడి విజయరావు గారు స్విస్‌బ్యాంక్ భాగోతం గురించి చక్కగా తెలియజేశారు. కూరగాయలతో ప్రాణుల బొమ్మలు చూడ ముచ్చటగా వున్నాయి. తమ్మెర రాధిక గారి పల్లెటూరు కథ బావుంది. తెల్సా శీర్షిక స్నేహ సంచికకే మణిపూసగా వెలుగొందుతోంది. హిమక్రీముల గురించి తెలుసుకున్నాం. శ్రీశ్రీ కథలు గురించి కొత్తపుస్తకాలులో పరిచయం చేసుకోగలిగాం. కవిత్వంలో కవితాక్షరాలకు తగ్గట్టు చిత్రాలను అందించటం బావుంది. గని సీరియల్ ఆసక్తికరంగా కొనసాగుతోంది. ఆరోగ్యం శీర్షిక ఎన్నెన్నో వ్యాధుల గురించి అవగాహన కలిగిస్తుండడం అభినందనీయం. బాలనేస్తాలులో బీర్బల్ కథలు ఆకట్టుకుంటున్నాయి. మనలో మాటగా కొత్త నిరసన పుణ్యమాని విలేకర్ల సమావేశంలో ఏ జోడు, బూటు ఎగిరిపడుతుందోనని హడలెత్తిపోతున్నారు.

**-నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.**

## 'పల్లెటూరు' బావుంది

ఈవారం అందించిన కవితలు రెండూ మాకు బాగా నచ్చాయి. కథ శీర్షికలో వచ్చిన పల్లెటూరు బావుంది. నేడు కొంతమంది పల్లెటూళ్లో ఉండేవారు పట్టణంమీది మోజుతో ఎప్పుడెప్పుడు సిటీకి వచ్చి వుందామా అని చూస్తున్నారు. అటువంటి వారు ఈ కథ చదివితే పల్లెల్లో ఉన్నదేంటో, పట్టణాల్లో ఉన్నదేంటో కనీస అవగాహన ఉంటుందేమో! ఇంత మంచి కథ అందించిన రాధిక గారికి అభినందనలు. కూరగాయలతో రకరకాల ప్రాణులు బాగున్నాయి. పెంగ్విన్‌లైతే నిజంగానే అవి వచ్చి మన కళ్లముందు కూర్చున్నాయా అన్నట్టున్నాయి.

**రాజేశ్వరరావు.ఎమ్, విశాఖ.**

## చాలా విషయాలు తెలుసుకున్నాం

ఆరోగ్యం శీర్షికలో గత రెండు వారాలుగా అందిస్తున్న పిల్లల్లో వినికిడి శక్తి లోపాలు చదివి మేము చాలా విషయాలు తెలుసుకున్నాం. వినికిడి శక్తి కోల్పోవడానికి కారణాలు, చికిత్స, నివారణ, చిన్న పిల్లలకే కాకుండా పెద్దవారిలో కూడా ఈ సమస్య ఎప్పుడొస్తుంది వంటి చాలా విషయాలు తెలిజేసినందుకు డాక్టర్ శాస్త్రిగారికి అభినందనలు. అలాగే గుడిపూడి విజయరావు గారు అందించిన కవర్‌స్టోరీ చదివి ఎంతో తెలుసుకున్నాం. స్విస్ బ్యాంకులో డబ్బును ఎవరెవరు, ఏ ప్రయోజనం కోసం దాచుకుంటారో ఈ శీర్షిక చదివిన తర్వాత అర్ధమైంది. అసలు స్విస్ బ్యాంకులోకి డబ్బు ఎలా చేరవేస్తున్నారో కూడా తెలుసుకొన్నాం. ఇంత జరుగుతున్నా అన్నీ తెలిసి కూడా ప్రభుత్వం ఏమీ పట్టనట్టు ఎందుకుంటుందో? అసలు అలాంటి బ్యాంకులు లేకుండా వుంటే ఆ నల్లధనం మొత్తం సొంత దేశాలకు వచ్చి వుండేదేమో. అప్పుడు ఇన్ని కరువు కాటకాలు, పేదరికం లేకుండా దేశాలు అభివృద్ధి చెందుతాయిగా.

**పి. మాధవి, ఉమాదేవి, విద్యానగర్, గుంటూరు.**

## వారణాసిని ప్రత్యక్షంగా చూశాం

ఈ వారం చూద్దామా శీర్షికలో బాగంగా వారణాసిని పరిచయం చేశారు. నిజంగానే వారణాసి వెళ్లి ప్రత్యక్షంగా చూసి వచ్చినట్టుగా వుంది. ఈ మండే ఎండల్లో కూల్‌కూల్‌గా హిమక్రీములను తింటుంటే మంచులో తడిసినట్టుగా వుంటుంది. కొత్త పుస్తకాల్లో శ్రీశ్రీ కథలు పరిచయం చేసినందుకు ధన్యవాదాలు.

**వి. కోటేశ్వరరావు, కందుకూరు.**



## కొత్త నిరసన సూపర్

వారం వారం తెల్సా శీర్షిక ద్వారా కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. గని సీరియల్ బావుంటోంది. ఈ వారం పల్లెటూరు కథ, మనలో మాట కొత్త నిరసన, కవిత్వంలో సంక్షోభంలో ప్రపంచీకరణ సూపర్‌గా వున్నాయి. అట్టమీది కథ చదివి స్విట్జర్లాండ్‌లోని బ్యాంకుల గురించి, వాటిలో ఎలా, ఎవరు డబ్బును దాచుకోవచ్చో తెలిసింది. ఇంకా నల్లధనమంతా ఎలా ఆ బ్యాంకుల్లోకి వెళ్తోందో వివరంగా తెలిపినందుకు విజయరావుగారికి ధన్యవాదాలు.

**ఎల్. కరుణకుమారి, చిత్తూరు.**

★

## కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

## ఊసరవెల్లి విలక్షణం

ఊసరవెల్లి రంగులు మార్చగలిగేదిగా గుర్తింపు పొందింది. ఇది ఆకుపచ్చ, గోధుమ పసుపు, తెలుపు, నలుపు రంగులలోనికి తన శరీరం రంగును మారుస్తుంటుంది. అయితే మనకు తెలియని మరో అద్భుతమైన విలక్షణం ఊసరవెల్లి స్వంతం. ఇది తన దృష్టిని ఒకేసారి రెండు విభిన్న కోణాలవైపు సారించగలదు. ఒక కంటితో ముందుకు చూస్తూ మరో కంటితో పైకి, పక్కలకు చూడగలదు. ఈ రకంగా అది ఒకేసారి అన్ని వైపులకు దృష్టి సారించి శత్రువును పసిగట్టగానే తన శరీరం రంగును తాను వున్న ప్రదేశం రంగుకు మార్చివేస్తుంది. అది ఆకలితో ఎరను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడే తన కళ్లను చుట్టు పక్కలకు తిప్పడం ఆపు చేస్తుంది.





## అతిపెద్ద మామిడి చెట్టు

మన దేశంలో చండీఘర్ నగర సమీపంలో గల బుల్లెట్ అనే గ్రామంలోని మామిడి చెట్టు ప్రపంచంలోకెల్లా అతి పెద్ద మామిడి చెట్టుగా గుర్తించి రికార్డులో నమోదు చేశారు. ఈ చెట్టు కాండం చుట్టు కొలత 9.75 మీటర్లు. అంతేకాదు. ఈ చెట్టునీడ విస్తీర్ణం 2.258 చదరపు మీటర్లు. దీనికి 'ఛప్పర్' అని పేరు వుంది. ఛప్పర్ అంటే నివాసం అని అర్థం. మధ్యాహ్నంపూట ఈ చెట్టు నీడన పెద్ద సంఖ్యలో కూర్చొని పని చేసుకోగలిగే వీలుండేది. ఈ మామిడి చెట్టు ప్రతి సంవత్సరం 16.8 టన్నుల ఫలసాయాన్నిచ్చేది. ఒకసారి ఈ చెట్టు ఫలసాయాన్ని 21 బళ్లలో పాటియాలా పళ్ళ మార్కెట్‌కు తీసుకురాగా అవి మొత్తం ఒక తోట ఫలసాయమని ప్రజలు భావించారు. ఈ అద్భుతమైన వృక్షరాజం 1955లో ఒక పిడుగుపాటుకు కూలిపోయింది.

# తెల్సా!



## పిల్లల్ని కనే పాములు!

సాధారణంగా పాములు గుడ్లు పెట్టి తరువాత పిల్లల్ని పొదగడం చూస్తాం. కానీ, నిజానికి కొన్ని పాములు గుడ్లు పెట్టకుండా ఏకంగా పిల్లలనే కనేస్తాయి. నేలపై పాకే జీవులన్నింటిలోనూ ఎక్కువ శాతం గుడ్లు పెట్టేవే వున్నాయి. కొన్ని పాములు మాత్రం ఇలా తమ కడుపు లోపలే గుడ్లను పొదిగి పిల్లలను కంటాయి. తల్లి పాము నుంచి కడుపు లోపల వుండే పిల్ల పాములు తమకు కావాల్సిన పోషకపదార్థాలను, రక్త సరఫరాను పొందుతాయి. అంటే మనుషుల మాదిరిగానే ఇవి కూడా గర్భం దాలుస్తాయన్న మాట. బహిర్గతంగా పొదిగే గుడ్లు మాదిరిగానే ఈ లోపలి గుడ్లు కూడా చాలా నున్నగా మృదువుగా వుంటాయి.

## పాదరక్షల పురాణం

ఇప్పుడు వయోభేదం లేకుండా ప్రతి ఒక్కరూ పాదరక్షలు ధరిస్తున్నారు. అయితే వీటికి ఎన్నో యుగాల చరిత్ర ఉంది. అమెరికాలోని 'ఫుట్‌వేర్ కౌన్సిల్' అనే సంస్థ పాదరక్షల చరిత్రకు సంబంధించి అనేక ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఇటీవల యువత ఎక్కువగా ధరించే ఎత్తు మడమల పాదరక్షలు ఇప్పటివి కాదు. ఎన్నో శతాబ్దాల క్రితం గ్రామీణ నాటకంలో హీరో హీరోయిన్లు హుందాగా, దర్పంగా కనబడటానికి నాలుగు అంగుళాల ఎత్తు మడమలు గల పాదరక్షలు ఉపయోగించేవారు. నడుస్తున్నప్పుడు వివిధ రకాల శబ్దాలు రావటానికి కిర్రు చెప్పులు ఉపయోగించేవారు. రంగస్థలంపై ఆ సన్నివేశానికి తగినట్టుగా పాదరక్షల రంగు, డిజైన్, శబ్దం మాత్రమే కాదు. కొన్ని రకాల పాద రక్షలు ప్రతి అడుగులోనూ శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించేవి. 16,17 శతాబ్దాలలో టర్కీలో 12 అంగుళాల ఎత్తుమడమలున్న చెప్పులు ఉపయోగించేవారు. ఈ ఫ్యాషన్ క్రమంగా ఇటలీ, ఇంగ్లాండ్ దేశాలకు వ్యాపించింది. టుటాంమెన్ అనే టర్కీరాజు రంగులతో రకరకాల బొమ్మలు వేసిన చెప్పులు ధరించేవాడు. 1926లో జపాన్‌ను పాలించిన హీరో హిటో చక్రవర్తి 12 అంగుళాల ఎత్తు మడమల పాంకోళ్ళు ధరించి అందరి కంటే తన ఆధిక్యతను చాటుకునేవాడు. 3వ శతాబ్దంలో బ్రిటన్ క్రిసీపిన్ అనే చర్మకారుడు సామాన్యులకు పనికి వచ్చే చెప్పులు తయారు చేశారు. 1518–89 మధ్యకాలం క్యాథరైన్ డిమెసి అనే ఫ్రెంచి దేశపు నర్తకి నృత్య ప్రదర్శనలు ఇచ్చేటప్పుడు ఎత్తు మడమలు గల పాదరక్షలు ధరించేది. మధ్య యుగంలో మూఢ విశ్వాసాలు, క్షుద్ర శక్తుల ప్రభావం ఎక్కువగా ఉండేది. మొనదేలిన పాదరక్షలు ధరిస్తే దుష్ట శక్తులు తమ దరికి రావనే నమ్మకం ఉండేది. 12 అంగుళాల ఎక్కువ పొడవుతో కొనదేలిన పాదరక్షలు ధరించేవారు. ఆధునిక యుగంలో వస్తున్న రకరకాల పాదరక్షలకు ఇంత చరిత్ర వుందన్నమాట!

# దారి దీపాలు


- టి. నరసింహయ్య
సీనియర్ కమ్యూనిస్టు నాయకులు

**ఉద్యమాలలో పాల్గొనేవారికి జీవితానుభవాలతో పాటు గొప్ప పుస్తకాలతో పరిచయం కూడా బాగా ఉపయోగపడుతుందని నాకనిపిస్తుంది. పెద్ద చదువరిని కాకపోయినా కొంత విముఖంగానే నన్ను ప్రభావితం చేసిన పుస్తకాల గురించి రాయడానికి కారణమదే. అందరికీ పరిచితమైన పలు పుస్తకాల గురించి నేను రాయలేదు. కాని గోర్కి 'అమ్మ' గురించి ఆఖరులో చెప్పి ముగిస్తాను. నేను జైలుకు వెళ్లినపుడు ఆ పుస్తకం మా అమ్మ సరస్వతమ్మ చేతిలో పడింది. అది ఆమెను ఎంతగా ప్రభావితం చేసిందంటే జీవితమంతా దాన్ని భగవద్గీతలా దగ్గరుంచుకుంది. ఆధ్యాత్మిక చింతన వున్నా మానవతా విలువలు పాటించిన మా అమ్మ దాదాపు వందేళ్లు బతికింది. ఆఖరు వరకూ ఆమె దాన్ని మర్చిపోలేదంటే మహా రచయితల గొప్పతనం మనకు తెలుస్తుంది.**




**న**న్ను అమితంగా ప్రభావితం చేసి జీవిత గమనాన్ని మార్చుకునేందుకు దోహదం చేసిన పుస్తకాలు రెండు- నండూరి ప్రసాదరావు రచించిన 'మార్క్సిస్టు మూల సూత్రాలు', ప్రిన్స్ క్రోపాట్కిన్ 'విప్లవ సందేశం'. ఇందులో ఒకటి సైద్ధాంతిక అవగాహనకు పునాదులు వేసింది. మరొకటి ఆచరణకు అవసరమైన ఉత్తేజాన్ని అందించింది.

జీవితంలో స్ఫూర్తినిచ్చిన పుస్తకం అంటే ఏ ఒక్కదాన్నో చెప్పడం కష్టం. ఎనభై ఏళ్లు దాటిన జీవితంలో, ఆరుపదులు పైబడిన రాజకీయ జీవితంలో అనేక మలుపుల్లో దారి దీపాలై వెలుగునిచ్చిన పుస్తకాలు అనేకం వున్నాయి. వ్యక్తుల ఆదర్శాలు, ఆయా సంఘటనలు కూడా వివిధ దశల్లో వివిధ రకాలుగా ప్రభావం చూపించి వుంటాయి. అయితే అందులో చెరగని ముద్రల్లా మిగిలిపోయినవే చెప్పుకుంటాము.

కర్నూలు జిల్లా గార్గేయపురం గ్రామంలో సంప్రదాయ సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన నాకు మొదటి నుంచి సమాజం గురించిన ఆసక్తి వుండేది. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు సాహిత్యం అన్నా బాగా ఇష్టం. తెలుగులో ఎప్పుడూ మొదటి మార్కు వచ్చేది. హైస్కూలులో తెలుగు గద్య పద్య భాగాల్లోని సాహిత్యాంశాలు బాగా ఆకర్షించేవి. భర్తృహరి సుభాషితాలు, శతకాలు, మొల్ల రామాయణంలో భాగాలు, శృంగార నైషధం, పల్నాటి వీర చరిత్ర వంటివన్నీ బాగా చదివేవాణ్ణి. మా తెలుగు మాష్టారు కూడా బాగా చెప్పడం ఆసక్తిని పెంచింది. కాలేజీ చదువు తర్వాత కళా పూర్ణోదయం, మనుచరిత్రము, వసుచరిత్ర. భారతి సంచికలు మా ఇంటి దగ్గరలో అన్నమ రాజ శర్మ అనే భావకవి దగ్గర తెచ్చుకుని చదివాను. భారత భాగవతాలు కూడా ఎక్కడ దొరికినా తెచ్చుకుని చదివాను.

స్వాతంత్రం రావడానికి ముందు ఆఖరి దశ అది. గ్రామంలో కాంగ్రెసే ప్రధాన పార్టీ. భూస్వాములు, పెత్తందార్లు అందరూ అందులో వుండేవారు. నా ఇంటర్ పూర్తయిన తర్వాత రాజకీయ పుస్తకాలు చదివి కాంగ్రెస్ సమావేశాలు ఏర్పాటు చేయించాను. అయితే గ్రామంలో భూస్వాముల దగ్గరకు వచ్చేసరికి ఈ పెద్దమనుషులు పక్షపాతంగా వ్యవహరిస్తారని, అందరూ దోపిడీ దౌర్జన్యాలు చేసేవారని అర్థం చేసుకున్నాను. మా వూర్లో వున్న కాంగ్రెస్ జిల్లా సహాయ కార్యదర్శి, తాలూకా సహాయ కార్యదర్శులతో వాదించేవాణ్ణి. కాని జవాబులు దొరకలేదు. క్రమంగా కాంగ్రెస్ పట్ల అసంతృప్తి పెరిగింది. మా వూళ్లోనే నా మిత్రుడు రాముడు సోషలిస్టు పార్టీలో చేరి క్రమంగా కమ్యూనిస్టు పార్టీ వైపు వచ్చాడు. 1949 ప్రాంతాల్లో వివిధ సందర్భాలలో మా మధ్య చర్చలు, వాదనలు నడిచేవి. అతను కమ్యూనిస్టు సిద్ధాంతం గురించి చాలా విషయాలు చెప్పేవాడు. కాని నేను లేవనెత్తే సందేహాలకు సమగ్రమైన సమాధానాలు లభించేవి కావు. నా పోరు పడలేక కొన్ని పుస్తకాలు తెచ్చి ఇచ్చేవాడు. వాటిని చదివి సందేహాలు తీర్చుకోమనే వాడు. వాటిలో బాగా నచ్చినవే మొదట చెప్పిన రెండు పుస్తకాలు.

ప్రిన్స్ క్రోపాట్కిన్ రష్యాకు చెందిన అరాచక వాది. కమ్యూనిస్టు నిర్మాణంలో వున్నవాడు కాదు. కాని యోధుడు. మంచి రచయిత కూడా. అతని రచనను మహీధర సోదరులు 'విప్లవ సందేశం' పేరిట అనువదించారు. జీవితంలో ఏ వృత్తిని

తీసుకున్నా ఎవరు తమ కర్తవ్యం నెరవేర్చాలన్నా రెండు వర్గాల మధ్య ఎదురయ్యే తేడాను క్రోపాట్కిన్ ఆ పుస్తకంలో చక్కగా చెబుతాడు. ఉదాహరణకు ఒక డాక్టరుకు అజీర్తి, ఆకలి రెంటికి సంబంధించిన రోగులు ఎదురవుతారు. ఒక న్యాయవాది వర్గ ప్రధానమైన చట్టాలతో నిజంగా న్యాయం చేయలేకపోతాడు. నీవు నిజంగా నీ బాధ్యతను సరిగ్గా నెరవేర్చాలంటే సమధర్మం వుంటేనే సాధ్యమని క్రోపాట్కిన్ సందేశమిస్తాడు. ఇది నన్ను బాగా ఆకర్షించింది.

ఇక నండూరి ప్రసాదరావు రాసిన 'మార్క్సిస్టు మూల సూత్రాలు'. సమాజానికి ఆర్థిక వ్యవస్థకూ సంబంధించిన అవగాహనను అందించింది. సమాజ పరిణామాన్ని, ఆర్థిక విధానాలను, అదనపు విలువ ఉత్పత్తి దోపిడీలను, పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి సామ్రాజ్యవాద దశ అంతర్గత సంక్షోభాలు, సోషలిస్టు సమాజ స్థాపన అనివార్యమనే మౌలిక అంశాలను సులభంగా వివరించింది. మార్క్సిజమే సరైన సిద్ధాంతమని నమ్మకం కుదిరింది. నేను పూర్తిగా కమ్యూనిస్టు కార్యకర్తను కావడానికి అది కారణమైంది. దాన్ని బాగా చదివిన ' ఫలితంగానే 1952లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడనైన తర్వాత రాజకీయ తరగతులకు హాజరైనప్పుడు విషయం త్వరగా గ్రహించడానికి, మా బృందంలో వాళ్లకు వివరించడానికి వీలయింది.

ఈ రెండు పుస్తకాల కొనసాగింపుగా చెప్పుకోవలసింది జూలియస్ ఫ్యూజిక్ 'రక్తాక్షరాలు'. విప్లవోద్యమంలో ఎదురయ్యే కష్టనష్టాలు అగ్నిపరీక్షలు తట్టుకోవడానికి కావలసిన మనో నిబ్బరం ఆ పుస్తకం ఇచ్చింది (దాని గురించి గత వారమే సుధాభాస్కర్ వివరించారు).

పుస్తకాలు పత్రికలు శ్రద్ధగా చదవడమనే అలవాటు తర్వాత కూడా కొనసాగినా ప్రత్యేకంగా చెప్పుకోవలసింది 1964లో జైలు జీవితంలో అధ్యయనం గురించి. జైలు జీవితంలో ఆటలు, అధ్యయనం నిరంతరంగా కొనసాగాయి. 1965లో రాజమండ్రి నుంచి సికింద్రాబాదు జైలుకు మమ్మల్ని తరలించారు. అక్కడే సుందరయ్య, బసవపున్నయ్య, తరిమెల నాగిరెడ్డి తదితర నాయకులతో పాటు వివిధ జిల్లాల ముఖ్యులందరూ వున్నారు. క్రమబద్ధంగా క్లాసులు జరిగేవి. విడుదలైన తర్వాత జిల్లాల్లో క్లాసులు చెప్పడానికి అవసరమైన అధ్యయనం చేయాలని కూడా నాయకులు సూచించారు. నేను రాజకీయ అర్థశాస్త్రం చదివాను. చదివినదంతా నోట్సు తీసుకుని క్లాసులు చెప్పడానికి సిద్ధమైనాను. తరిమెల నాగిరెడ్డి సూచన మేరకు లియాంటివ్ అర్థశాస్త్ర ప్రథమ పాఠాలు చదివాను. తర్వాత ఏం చదివితే బాగుంటుందని ఆయనను అడుగుతుంటే పక్కనే వున్న సుందరయ్య గారు విని ఒక ఉద్గ్రంథం ఇచ్చారు. అది సోవియట్ అకాడమీ ఆఫ్ పొలిటికల్ సైన్సెస్ కమిటీ తయారు చేసిన పుస్తకం. అర్థశాస్త్రంతో పాటు దానిపై ఆధారపడి వివిధ దేశాల్లో పెంపొందిన సామాజిక సాంస్కృతిక విషయాలన్నిటి విశ్లేషణ. దానికి స్టాలిన్ పరిష్కర్త. మన దేశానికి దాని పది కాపీలు మాత్రం వచ్చాయట.అందులో తొమ్మిది సిపిఐ వారి దగ్గరే వుండగా ఇదొక్కటే తన దగ్గర వుందని జాగ్రత్తగా చదవాలని సుందరయ్య గారు చెప్పారు. ఆ పుస్తకం ప్రాధాన్యతను, ఆయన చూపించిన శ్రద్ధను దృష్టిలో పెట్టుకుని చాలా జాగ్రత్తగా చదివి నోట్సు రాసుకున్నాను. అది నా కొద్దిపాటి అధ్యయనంలో పెద్ద మలుపు.1966లో విడుదలైన తర్వాత అర్థశాస్త్రం క్లాసులు చెప్పడం మొదలెట్టాను. దాదాపు ఇరవై ఏళ్ల పాటు రాష్ట్ర వ్యాపితంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ క్లాసులు చెప్పడానికి ఆ నోట్సు మార్గదర్శకమైంది. ఇప్పటికీ ఆ క్లాసులకు హాజరైన ఎంతో మంది గుర్తు చేస్తుంటారు. ఇటీవల విడుదలైన నా జ్ఞాపకాలకు ముందు మాట రాసిన కామ్రేడ్ బి.వి.రాఘవులు కూడా ఆ క్లాసులనే ప్రస్తావించారు. ఎమర్జన్సీ కాలంలో రహస్యంగా వుండగా ఆ సోవియట్ గ్రంథంలో ముఖ్యభాగాలు అనువాదం చేశాను. అయితే ఈలోగానే నండూరి ప్రసాదరావు గారు లియాంటివ్ రచన అనువాదం ప్రచురించడంతో నా అనువాదాన్ని పక్కన పెట్టేశాను.

సాహిత్య విషయాలకొస్తే మొదటి నుంచి నాకు కవితా పఠనం చాలా ఆసక్తిగా వుండేది. చిన్నప్పుడు పౌరాణిక నాటకాల్లో పాత్రలు కూడా వేయడమే కాక పురాణాలు, కావ్యాలు చదవడం ఇందుకు కారణమైంది. రాజకీయ చైతన్యం పెరిగిన కొద్ది ఆధునిక సాహిత్యంతోనూ పరిచయమైంది. టీచర్ ట్రైనింగ్ కోసం చేరినప్పుడు మా మాష్టారు ఒకసారి 'సింధూరం రక్త చందనం', 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం' వంటి కవితలు మహోత్తేజకరంగా చదివి వినిపించాడు. వెంటనే మాష్టారును కలిసి వివరాలు తెలుసుకుని శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కావ్యం కొని చదివి ఉత్సాహ పడ్డాను.

శ్రీశ్రీ 'యుగం' పేరిట వచ్చిన ఒక కవితా సంకలనం కూడా నన్నెంతగానో ఆకట్టుకుంది. ఆయన అందులోనే శరశ్చంద్రిక పేరిట చందమామను ఉద్దేశించి రాసిన కవిత అద్భుతమైంది. దాన్ని చదువుతుంటే మిత్రులు తలలూపుతూ వినేవారు. అందులోనే సారథి రాసిన 'సామాన్యుని వీలునామా' అన్న కవిత నన్ను మరీ ఆకట్టుకుంది. దాన్ని, శ్రీశ్రీ ఇతర కవితలను మా పిల్లలకు నేర్పిస్తే వారు మహాసభల్లో చదవుతుండేవారు. తర్వాత వారిలో సాహిత్య ఆసక్తి పెరగడానికి కూడా అది దోహదం చేసింది. భర్తృహరి పద్యాలను కూడా రోజుకొక్కటి చొప్పున రాసి బట్టీవేయించేవాణ్ని. అందులో ధైర్యపద్ధతి, విద్వద్పద్ధతిలో వున్న పద్యాలు నేటికీ మంచికోసం పోరాడే వారికి ఎంతో ఉత్తేజమిస్తాయని నా ఉద్దేశం.

ఉద్యమాలలో పాల్గొనేవారికి జీవితానుభవాలతో పాటు గొప్ప పుస్తకాలతో పరిచయం కూడా బాగా ఉపయోగపడుతుందని నాకనిపిస్తుంది. పెద్ద చదువరిని కాకపోయినా కొంత విముఖంగానే నన్ను ప్రభావితం చేసిన పుస్తకాల గురించి రాయడానికి కారణమదే. అందరికీ పరిచితమైన పలు పుస్తకాల గురించి నేను రాయలేదు. కాని గోర్కీ 'అమ్మ' గురించి ఆఖరులో చెప్పి ముగిస్తాను. నేను జైలుకు వెళ్లినపుడు ఆ పుస్తకం మా అమ్మ సరస్వతమ్మ చేతిలో పడింది. అది ఆమెను ఎంతగా ప్రభావితం చేసిందంటే జీవితమంతా దాన్ని భగవద్గీతలా దగ్గరుంచుకుంది. ఆధ్యాత్మిక చింతన వున్నా మానవతా విలువలు పాటించిన మా అమ్మ దాదాపు వందేళ్లు బతికింది. ఆఖరు వరకూ ఆమె దాన్ని మర్చిపోలేదంటే మహా రచయితల గొప్పతనం మనకు తెలుస్తుంది.

★




**తర్వాత ఏం చదివితే బాగుంటుందని ఆయనను అడుగుతుంటే పక్కనే వున్న సుందరయ్య గారు విని ఒక ఉద్గ్రంథం ఇచ్చారు. అది సోవియట్ అకాడమీ ఆఫ్ పొలిటికల్ సైన్సెస్ కమిటీ తయారు చేసిన పుస్తకం. అర్థశాస్త్రంతో పాటు దానిపై ఆధారపడి వివిధ దేశాల్లో పెంపొందిన సామాజిక సాంస్కృతిక విషయాలన్నిటి విశ్లేషణ. దానికి స్టాలిన్ పరిష్కర్త. మన దేశానికి అది పది కాపీలు మాత్రం వచ్చాయట.అందులో తొమ్మిది సిపిఐ వారి దగ్గరే వుండగా ఇదొక్కటే తన దగ్గర వుందని జాగ్రత్తగా చదవాలని సుందరయ్య గారు చెప్పారు. ఆ పుస్తకం ప్రాధాన్యతను, ఆయన చూపించిన శ్రద్ధను దృష్టిలో పెట్టుకుని చాలా జాగ్రత్తగా చదివి నోట్సు రాసుకున్నాను. అది నా కొద్దిపాటి అధ్యయనంలో పెద్ద మలుపు.**

## సీరియల్

**జరిగినకథ:**

తలకు తగిలిన దెబ్బవలన గనిలో పనిచేసే చంచల్‌కుమార్‌కి ఊపిరి ఆడడం కష్టమౌతుంది. పైగా ఆకలి బాధ. కడుపునిండా నీళ్లు తాగినా క్షుద్బాధ ఏమాత్రం తగ్గదు. తనకు తెలీకుండానే స్పృహ తప్పి పడిపోతాడు. తోటివారు అతణ్ణి లేపి గంజినీళ్లు అందిస్తారు. గుమస్తా ఇదంతా చూసి అగ్గిమీద గుగ్గిలం అవుతాడు. ఆ మాత్రం దానికే ఉత్పత్తి తగ్గి నష్టం వస్తుందని అతని బాధ. వెంటనే కొరడా తీసుకొని చంచల్‌కుమార్‌కు సపర్యలు చేస్తున్న వారి వంటిమీద నాట్యం చేయిస్తాడు. తను పడ్తున్న బాధకన్నా అది మరింత బాధిస్తుంది అతన్ని. ఇదిలావుండగా ఓరోజు గనిలో డైనమైట్ పేలి ఇద్దరు పనివారు చనిపోతారు. యాజమాన్యం నుంచి ఎటువంటి సాయమూ అందదు. అప్పుడు...

# గని

తమిళ మూలం : **కె. చిన్నప్పభారతి**

అనువాదం : **వి. వెంకటేశ్వర**

(ఐదవ భాగం)

**ఒ**కరిపట్ల మరొకరు అపనమ్మకం కలిగి ఉండడం ఒకరి మీద మరొకరు చాడీలు చెప్పడం వంటి ధోరణులకు స్వస్తి పలికి, ఒక్క తాటిమీద నిలవాలని నిర్ణయించారు. ఎలాంటి ఇబ్బందులనైనా అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలని నిర్ణయించారు. దోపిడీ నుంచి తమను కొద్దిగానైనా కాపాడుకోవడం గురించి ఆలోచించారు. తరతరాలుగా వస్తోన్న విశ్వాసాల గురించి, భయాల గురించి, విశ్వాసం లేని విషయాల గురించి, విధిరాత గురించి ఇలా అన్నింటి గురించీ చర్చించారు. తమ న్యాయమైన కోర్కెలు సాధించుకోవడంలో ఎలా ముందుకు పోవాలో నిర్ణయించారు. తమ కష్టాల గురించీ, బాధల గురించీ యాజమాన్యంవారికి ఎలా అవగతం చేయాలో కూడా నిర్ణయించారు.

వాళ్ళ ఆత్మస్థైర్యానికి ఇది పరీక్షా సమయం. ఇప్పుడు కష్టాల గురించి, దుఃఖాల గురించీ మాట్లాడుకోవడం కన్నా తమ హక్కుల సాధన గురించి దానివల్ల ఒనగూరే ప్రయోజనాల గురించి పరస్పరం ఒకరికొకరు ధైర్యం చెప్పుకోవాల్సిన తరుణం. అయినప్పటికీ తమ కార్యాచరణ వల్ల ఆసన్నమయ్యే అపాయాల గురించిన భయం ప్రతి ఒక్కరి మనసులోనూ చెలరేగుతోంది.

ఇద్దరు కార్మికులు మరణించిన తరువాత కార్మికులకు తమ పట్ల అసంతృప్తీ, వ్యతిరేకత ఏర్పడిన సంగతిని యాజమాన్యం సులభంగానే గుర్తించింది. దీన్ని మొగ్గలోనే తుంచేయాలని సంకల్పించింది.

కార్మికుల తమ స్థితిగతుల గురించి అవగాహన పెంచుకోకుండానూ, ఆలోచించకుండానూ, ఉంటేనే తన పబ్బం గడుస్తుందని ప్రతి యజమానికీ తెలుసు. న్యాయాన్యాయాల గురించీ, జీవిత అవసరాల గురించీ, వాళ్ళ ఆలోచన్ని పూర్తిగా తుడిచివేయాలని యాజమాన్యం భావించింది. ఇందుకు వాళ్లు ఎంచుకున్న మార్గం కార్మికులకు విరామ సమయం లేకుండా చేయడం, నలుగురు కూచుని మాట్లాడుకునే అవకాశం లేకుండా చేయడం.

కార్మికుల ప్రతిచర్యనూ వేయికళ్ళతో కనిపెట్టసాగింది యాజమాన్యం. వారికి ఎవరిపై సందేహం వస్తుందో ఉద్యోగం ఊడిపోతుందన్న భయం కార్మికులను తిరుగుబాటు చేయకుండా ఆపుతోంది.

కార్మికులు తమ దుస్థితి గురించి పరస్పరం చర్చించుకోవాలని భావిస్తున్నారు. అలాంటి అవకాశం రావడం కష్టం. రేయింబవళ్ళూ పని ఉండడం వల్లా, గనిలోంచి బయటికి రాగల వెసులుబాటు పొద్దువాలిన తర్వాత గానీ దొరక్కపోవడం వల్లా అలా చర్చించుకోవడం గగన కుసుమంగా తోచింది. పని ముగించి ఇళ్ళకు తిరుగు ముఖం పట్టినప్పుడూ, రాత్రిళ్లు ఇళ్ళ ముందర చలి మంట వేసుకొని గుమిగూడినప్పుడూ చర్చించుకోవడం మొదలుపెట్టారు. పర్యవసానంగా వాళ్ళ మనసుల్లో ఓ బీజం నాటుకుంది. అది క్రమంగా అంకురించింది. అది మహావృక్షంగా ఎదగాలన్న ఆకాంక్ష బలంగా ఉన్నప్పటికీ కొంత భయం, కొంత అయోమయం కలగలసిన తిరోగమన భావన కూడా మొదలైంది. తిరోగమన భావాన్ని మొగ్గలోనే తుంచేయాలన్న సంకల్పం కలిగింది. కొద్దికొద్దిగా మొదలైన అసంతృప్తిని బలమైన ఉద్యమంగా నిర్మించే పనిలో బికాస్ నిమగ్నుడయ్యాడు.

'చావు అందరికీ వచ్చేదే' కానీ గానుగెద్దులా పనిచేసి కూడా ఆకలి చావు బారిన పడడం దారుణం. అంతకంటే దారుణమైనది - ఆ చావుకు కారణమేమిటో తెలుసుకోకపోవడం, పరిష్కార మార్గాల గురించి ఆలోచించకపోవడం..." అంటూ ఆవేశంగా మాట్లాడుతూ ఊపిరి ఎగదోయడంతో ఖళ్లుఖళ్లున దగ్గాడు.

బికాస్ యువకుడు. సన్నగా, రివటలా ఉంటాడు. నిప్పు కణికల్లాంటి కళ్లు, కొనదేలిన ముక్కు, ఆకర్షణీయమైన విగ్రహం. అతడు దగ్గడంతో పత్తి అంటుకున్నట్టు చాలామంది దగ్గసాగారు. అతడు తన మాటలు కొనసాగించాడు.

ఈ దగ్గు మనకు ఎక్కడి నుంచి వచ్చింది? గని లోపల మనకు తెలియకుండానే మన ఊపిరితిత్తుల్లో చొరబడిన బొగ్గు పొగే ఈ అనారోగ్యశ్రీ. గని లోపల గాలి తగ్గినప్పుడల్లా మన ఊపిరితిత్తులు గాలిని విడుదల చేస్తాయి. అప్పుడు బొగ్గుపొగ మన లోపలికి ప్రవేశిస్తుంది. గని కార్మికుడి జీవితం ఎంత గొప్పగా ఉంటుందో కదా!

చుట్టూ చేరిన కార్మికుల్లో ఒకడు దగ్గుతూనే "అవునవును. కార్మికుడి జీవితమే కాదు మరణం కూడా అందంగానూ, ఆర్భాటంగానూ ఉంటుంది" అన్నాడు పీలగొంతుతో..

బికాస్ మరింత దగ్గుతూ "నడక నేర్చుకొనే దశలో పిల్లవాడు తప్పటడుగులు వేయక తప్పదు. కింద పడడం గాయపడడం నేర్చుకొనే క్రమంలో తప్పనిసరి అని తెలిసే పిల్లవాడు నడుస్తాడు, పరుగుదీస్తాడు. బాధల్ని

అనుభవించకుండా జీవితంలో ముందుకు పోతాడు" అన్నాడు.

చింపిరి జుట్టు, మాసిన గడ్డం, వరిపైరు వేరులా నోటికేసి వ్యాపించిన మీసం, చింతనిప్పులాంటి కళ్లు, చిటపటలాడే మొహం - వెరసి అనిల్‌బిశ్వాస్. 'మన కష్టాలు చెప్పుకొందామంటే యజమాని దర్శన భాగ్యమే గగనం కదా! మరి మన కష్టాలు ఎవరితో చెప్పుకోవడం? ఫలానా ఫలానా సదుపాయాలు చేసి పెట్టమని ఎవర్ని అడగడం? ఎలాగోలా అడుగుదామనుకుంటే ఇది పద్ధతిగా లేదనీ అధిక ప్రసంగమనీ కదా భావిస్తోంది యాజమాన్యం?

బికాస్ అతడికేసి ఓ మారుచూసి గొంతు సవరించుకొన్నాడు "మనం గనినంతా మనకు రాసివ్వమనడం లేదుగా. ఆకలితో చావకుండా ఉండాలని మాత్రమే కోరుకొంటున్నాం. మన జీవితాలు గనితోనే ముడిపడి ఉన్నాయి. వాళ్ల ప్రపంచం పెద్దది. మన ద్వారా ఈ గని వాళ్లకు అనుభవించడానికీ, ఆస్వాదించడానికీ కొత్త కొత్త అవకాశాలు కల్పిస్తోంది. మనమేమో దరిద్ర నారాయణలుగానే మిగిలిపోతున్నాం."

జాలిగొలిపే చూపులతోనూ సందేహం ధ్వనించే స్వరంతోనూ ఒకడన్నాడు, 'మనం బడుగువాళ్లం. వాళ్లను ఎదిరించగల బలం మనకు ఎక్కడి నుంచి వస్తుంది?'

ఏదో రంగుల కల కంటున్నట్లు బికాస్ చెప్పాడు 'మనిషికి గౌరవ మర్యాదలు గానీ, పలుకుబడి గానీ మధ్యలో వచ్చేవే. మన శ్రమ వాళ్ళ ఇనప్పెట్టెను నింపుతుంటే, అవి వాళ్లను వెతుక్కుంటూ వచ్చాయి. ఆకలీ, దారిద్ర్యమూ యుగయుగాలుగా మనల్ని పట్టి పీడిస్తున్నాయి. అవి నశించినప్పుడు గౌరవం కానీ, పలుకుబడి గానీ ఏ ఒక్కరికో సొంతం కాకుండా పోతుంది'. నీళ్లులేని కుళాయిని తెరిచినప్పుడు వెలువడే గాలిలాంటి శబ్దం అతడి కంఠంలోంచి వెలువడుతోంది. మునివేళ్లతో వీణ తీగల్ని మీటినట్టు అతడి హృదయం మృదువుగా స్పందిస్తోంది. 'మానవ ప్రయత్నం అన్నది గుప్పెట్లో పట్టుకోలేని గాలి వంటిది కాదు. బుద్ధి చాంచల్యం గానీ, విరక్తి గానీ కలగకుండా చూసుకోవాలి.

**కార్మికుల శ్రమదోపిడీ చెయ్యడం అతడికి కొట్టిన పిండి. వాళ్ల మెడలు వంచి పని చేయించుకోవడంలోనూ దాన్ని ప్రశ్నించడానికి వీల్లేనంతగా వాళ్ల మనసుల్లో భయం పుట్టించడంలోనూ అతడు రాటుదేలినవాడు. వాళ్ల మనసుల్లోని స్పందనల్ని అణగార్చడానికి తగిన ఆయుధం శ్రమదోపిడీ చేయడమేనన్న అవగాహన అతడిది. ఈ విషయంలో అతడికి ఎటువంటి సందేహమూ లేదు. ఈ మంత్రదండం ప్రయోగించడం ద్వారా వాళ్ళ ఆత్మల్ని, దేహాన్నీ, స్వతంత్ర ఆలోచనా విధానాన్నీ ఇలా సమస్తాన్నీ అణగదొక్కేయవచ్చని అతడి అనుభవం. భయం కలిగించడం వాళ్ల సహజత్వాల్ని సమసిపోయేలా చేయడం సాధ్యమేనన్నది అతడి నిశ్చితాభిప్రాయం.**

సహకార్మికులకేసి చూశాడు. మెరుపులాంటి గాంభీర్యమూ, సముద్రంలాంటి ప్రశాంతత అతనికి అలంకారాలు.

బికాస్ నిష్కర్షగా చెప్పాడు - 'మన కోసం ఈ ప్రపంచంలో ఎంతో ఉంది. మనం ఉత్పత్తి చేసే సంపద అపారమే గానీ మనకు మాత్రం అందనంత దూరంలో ఉంటుంది. మనకు అడ్డంకి ఉన్నది ఏదో తెలుసుకోవాలి. నా మనసులో ఒక నిజం పలుకుతోంది. మనం తయారుచేసి పెడుతోన్న సౌకర్యాలు నుంచి మనల్ని ఎల్లప్పుడూ దూరంగా ఉంచడం బ్రహ్మ తరం కాదు. మనం ఈ విషయం గ్రహిస్తేచాలు మనల్ని పీడిస్తోన్న వాళ్లంతా బూడిదై పోతారు"

వాతావరణంలోని కల్మషాన్ని తుడిచివేస్తున్నట్టుగా ఉంది బికాస్ ప్రసంగం. కంటికి కనిపించకుండా ఓ సాలెగూడు తన మొహాన్ని ఆక్రమిస్తున్నట్టు అనిపించి, మొహాన్ని, తలనూ చేతివేళ్లతో తుడుచుకొన్నాడు.

తమ కోరికల్ని ఒక విజ్ఞాపన పత్రంగా రూపొందించి గని యాజమాన్యానికి, కార్మిక సంక్షేమాధికారికీ అందజేయాలని నిర్ణయించారు. తమ ఇన్నేళ్ల దుఃఖాన్ని అది కొద్దిగానైనా రూపుమాపుతుందన్న కొండంత ఆశతో తమ తమ ఇళ్లు చేరుకొన్నారు.

## 4

"ముందస్తు ఏర్పాట్లేవీ చేసుకోకుండా ఓ చిన్న బృందంగా గుమిగూడి చర్చించుకున్నారు. ఒక్కో పువ్వు మీద వాలుతూ తేనె జుర్రుకునే తేనెటీగ తనకు తెలియకుండానే మకరందాన్ని ఎల్లెడలా వ్యాపింపజేసినట్టు పైవార్త గని అంతటా వ్యాపించింది. తలోరకంగా మాట్లాడసాగారు. "ఎందుకొచ్చిన గొడవ? ఊరుకుంటే పోలా?" అని కొందరు పెదవి విరిచారు. "యాజమాన్యానికి మన ఇబ్బందులు తెలియదా ఏం? దేనికైనా సమయం, సందర్భం కలిసి రావాలి. ఈ లోపలే గందరగోళం సృష్టిస్తే ఎలా?" అంటూ కొందరు గుసగుసలాడారు. 'మన సమస్యల్ని లోతుగా అర్థం చేసుకొని వాటి గురించి అర్థం చేసుకొని, వాటి గురించి స్పష్టంగా చెప్పగలవాడు ఇన్నాళ్లకు ఉదయించాడు. పక్షి కూనలు ఒక్క రోజులోనే ఎగురుతాయా? ఏదో విధంగా మన సంగతుల్ని బయటి ప్రపంచానికి ఎప్పటికప్పుడు వెల్లడిస్తూ ఉండాలి. ఎప్పుడో ఒకప్పుడు దాన్ని సరిగా గమనిస్తారు' అన్నారు మరికొందరు.

బొగ్గుబావులు తవ్వడానికి హక్కులు పొందిన పోలీసు అధికారి నుంచి గనుల్ని కౌలుకు తీసుకున్న కాంట్రాక్టరు తివారీ కార్మికుల్లో మార్పుని పసిగట్టాడు. గని మేనేజరు, ఇంజనీరు, మైనింగు మేస్త్రీ, మైనింగు గుమస్తాలతో ఓ సమావేశం పెట్టాడు.

గుర్రం మొహం, విప్పారిన మర్రి ఆకు లాంటి చెవులు, గాయపు మచ్చ కనిపించే మెడ తివారీ ఆనవాళ్లు. గనుల వ్యాపారంలో దిట్ట. దీర్ఘకాలికమైన ఒప్పందాలేవీ చేసుకోడు. ఏయేటి కాయేడు పొడిగిస్తూ ఒప్పందాన్ని నమోదు చేస్తాడు. బొగ్గు ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తన జాగ్రత్తలో తానుండడానికి, ఎలాంటి పరిస్థితుల్లోనూ తనకు నష్టం వాటిల్లకుండా వ్యాపార భద్రత కలిగించడానికీ ఈ పద్ధతి ఉపకరిస్తుందని అతడి అభిప్రాయం. సంపదను పెంచుకోవడానికి ఎలాంటి మార్గాన్నైనా అనుసరిస్తాడు. తక్కిన గని యజమానులెవరైనా అతడి వద్ద కాస్త అణకువగానే ఉంటారు. ఇబ్బంది పడుతున్న గని యజమానులకు, అధికవడ్డీకి డబ్బులిచ్చి, బాగా లాభం ఆర్జిస్తాడు. నష్టాలతో కూరుకుపోయిన గని ఏదైనా అమ్మకానికి వస్తే కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించాడు. ఆ యజమానికి చక్రవడ్డీకి అప్పు ఇచ్చి, తాను చక్రం తిప్పుతాడు. లాభార్జనకు తగిన ఉపాయాలు చెబుతాడు. చివరకు ఆ గనిని మరొకడికి అమ్మించి ఈ వ్యవహారంలో అసలుకూ, వడ్డీకి మించిన ధనం సంపాదిస్తాడు. అసలు అతడు గనిని కౌలుకు తీసుకోవడమే దాని నిర్వహణలో ఉన్న సాధకబాధకాలను గ్రహించి గనుల యజమానులకు వడ్డీకి అప్పివ్వడం కోసమే. కొంచెమైనా శ్రమించకుండా, ఏ మాత్రం ఒత్తిడి లేకుండా సునాయాసంగా డబ్బు సమకూర్చుకోవడంలో అతడు తలమునకలై ఉంటాడు. ఒకదాని వెంట మరొకటి వచ్చే అలల్లా సంపదలు అతణ్ణి వరిస్తున్నాయి.

కార్మికుల శ్రమదోపిడీ చెయ్యడం అతడికి కొట్టిన పిండి. వాళ్ల మెడలు వంచి పని చేయించుకోవడంలోనూ దాన్ని ప్రశ్నించడానికి వీల్లేనంతగా వాళ్ల మనసుల్లో భయం పుట్టించడంలోనూ అతడు రాటుదేలినవాడు. వాళ్ల మనసుల్లోని స్పందనల్ని అణగార్చడానికి తగిన ఆయుధం శ్రమదోపిడీ చేయడమేనన్న అవగాహన అతడిది. ఈ విషయంలో అతడికి ఎటువంటి సందేహమూ లేదు. ఈ మంత్రదండం ప్రయోగించడం ద్వారా వాళ్ళ ఆత్మల్ని, దేహాన్నీ, స్వతంత్ర ఆలోచనా విధానాన్నీ ఇలా సమస్తాన్నీ అణగదొక్కేయవచ్చని అతడి అనుభవం. భయం కలిగించడం వాళ్ల సహజత్వాల్ని సమసిపోయేలా చేయడం సాధ్యమేనన్నది అతడి నిశ్చితాభిప్రాయం.

తన మనసులోని మాట చెప్పకుండా, ముందుగా వాళ్ళ అభిప్రాయాలు అడిగి తెలుకొన్నాడు. తన మాటని వాళ్ల నోటి ద్వారా చెప్పించుకోవడం అతడి వ్యూహం. బొగ్గు ధరలు పెరుగుతాయని అందరూ భావిస్తున్నారు. కాబట్టి బొగ్గును నిల్వ చేయాలి. ధరలు తగ్గినా తనకు నష్టం రాకూడదు. ధరలు పెరిగితే ఒక్కసారిగా అత్యధిక లాభం రావాలి. ఇలా ఆలోచించి అతడు చర్చను ప్రారంభించాడు.

**(ఇంకావుంది)**

## కథ

**- డా॥ మంతెన సూర్యనారాయణరాజు**

> "మరి నేను వెళ్ళొస్తానండీ! చాలా థ్యాంక్స్" అంది లత.
> ఓంకార్‌కి ఆమెతో ఇంకా కాస్సేపు మాట్లాడాలని వుంది. పదే పదే ఆ మాటలు ఇంకా ఇంకా వినాలని వుంది. ఆమె చూస్తే వెళ్ళిపోతానంటోంది. సమయానికి బస్సు ఆగగానే ఈ కుంటి పిల్ల పానకంలో పుడకలా దాపురించింది. కొద్దిసేపు లతతో మాట్లాడాలనే నెపంతో "చూడండి లతగారూ! మీకభ్యతరం లేకపోతే నా విజిటింగ్ కార్డు ఇస్తాను. నా వల్ల మీకు ఎప్పుడు ఎటువంటి అవసరం వచ్చినా నేను మీ వాడిననుకుని రావాలి. పైగా మీరెప్పుడొచ్చినా మా ఇంటి తలుపులు మీకోసం నిరంతరం తెరిచే ఉంటాయి"

# దృష్టి

అప్పటిదాకా ఆలోచిస్తూ బస్సుకోసం ఎదురుచూస్తున్న ఓంకార్... అప్పుడే వచ్చి బస్సులోంచి దిగిన నల్లకళ్ళజోడు పెట్టుకున్న అమ్మాయిని చూడగానే కర్తవ్యం మరిచిపోయాడు. బస్సు కాస్సేపు పేరుకు ఆగినట్టు ఆగి తుర్రున వెళ్ళిపోయింది. తన మతి మరుపును తిట్టుకుంటూ ఆ అమ్మాయి మూలంగా బస్సు మిస్సయ్యిందని నొచ్చుకున్నాడు. ఆమెతో బాటు మరో నలుగురు పాసింజర్లు దిగారు. ఆగకుండా ఎవరి దారిన వాళ్ళు చక్కా వెళ్ళిపోయారు. ఓంకార్ ఆ అమ్మాయినే కన్నార్పకుండా చూస్తున్నాడు. "అమె అందంగా వుంది. ఎండ ఎక్కువగా లేకపోయినా ఎంతసేపటికీ కళ్ళజోడు తియ్యదేం" అనుకుంటూ తనలో తనే గొణుక్కున్నాడు. రోడ్డుమీద పోతున్న వాళ్ళు తప్ప చుట్టూ ఎవరూ లేరని దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. అతనికి తెలియకుండానే గుండె వేగంగా కొట్టుకోసాగింది. 'అసలీమె ఎవరయ్యుంటుంది? ఎందుకింకా ఇక్కడే నిలబడింది? మరో బస్సు మారాలి గాబోలు. తను ఆమె బస్సు ఎక్కడానికి తప్పకుండా హెల్ప్ చెయ్యాలి' లాంటి సవాలక్ష ఆలోచనలు అతని బుర్రను తొలిచేశాయి.

ఉండబట్టలేక దగ్గరకు వెళ్ళి "మేడం ఎందాకా పోవాలి!?" అంటూ వినయంగా అడిగాడు. కాని మనసులో ఆమె ఎడంకాలి చెప్పుతో కొడుతుందేమో! తిడుతుందేమో అనే శంక కలిగింది. దూరం నుండి వస్తున్న బస్సు హారన్ గట్టిగా వినిపించింది. ఆమె ఏదో చెప్పింది. అదేమైందీ ఓంకార్‌కి అర్థం కాలేదు. తాను ఎక్కాల్సిన నంబర్‌గల బస్సేమోనని పారజూశాడు. కాదు అది మరో రూట్‌కు పోయే బస్సు. ఇసికేస్తే రాలనంత జనంతో నిండు గర్భిణిలా వచ్చి ఆగింది.

ఆమె బస్సు నంబరు గురించి సరిగా పట్టించుకున్నట్లు లేదు. ఎందుకనో కంగారుగా "ఏవండీ! ఈ బస్సు ఎక్కడికి పోతుందండీ!" అంటూ కోకిల కఠంతో ఓంకార్‌నే అడిగింది. "వాటే మెలోడియస్ వాయిస్. ఇంకా కాస్సేపు ఈమెతో మాట్లాడాలి" అంటూ అతని మనస్సు మొండికేసింది. అయినా ఆమె ఎక్కడికెళ్ళాలో తెలుసుకోగోరి దగ్గరికెళ్ళి కలుపుగోలుగా "ఎందాక పోవాలి మీరు?" అంటూ ఆసక్తిగా అడిగాడు. ఈలోగా ఆగిన బస్సు తుర్రుమంటూ వెళ్ళిపోయింది.

"అరెరే! ఆమె బదులివ్వలేదు ఈ బస్సు వెళ్ళిపోయిందండీ! ఎక్కడికంటే తొందరగా చెప్పారు గాదు"

"పోనిద్దురూ! కాకపోతే మరోటి వస్తుంది. ఇంతకీ మీరెక్కడికెళ్ళాలేవిటి?" అడిగాడు కలుపుగోలుగా.

"అనాథశరణాయం దగ్గరకండీ!" అంది ఆమె తడుముకోకుండా. ఆమె సమాధానం ఓంకార్‌కి ఒక ప్రశ్నలా వేధించసాగింది.

"అయితే మేడమ్ మీకెవరూ వెనకా ముందూ లేరా!" అంటూ అడిగాడు.

"అవున్సార్! అందులోనే వుంటున్నాను. మీరు మరోలా అనుకోకపోతే కాస్త నాకు అందాకా తోడొస్తారా సార్ ప్లీజ్! మీ టిక్కెట్లు కూడా నేతీస్తాలెండి. ఒక్కసారి .... రండి" అంది.

ఓంకార్ మనస్సు లైన్ క్లియర్ అన్నట్లు కోతిలా కిచకిచలాడుతూ ఆ కొమ్మమీంచి ఈ కొమ్మమీదికి గెంతసాగింది. పిల్లి మొగ్గలు వేయసాగింది. "తంతే బూర్ల బుట్టలో పడ్డాను" అనుకుంటూ పైకి "అదేవిటండీ! పే చేస్తానన్నారే! దానికే బాధగా వుంది" అన్నాడు.

"అది కాదు సార్! మీరు మరోలా అనుకోకండి. ఆడపిల్లను. ఒంటరి దాన్ని. నా ఇబ్బంది అటువంటిది" అంటూ ముందుకు రెండడుగులు వేసింది.

బస్సు వస్తున్న అలికిడయ్యింది. ఓంకార్ ఆమెకు సహాయం ఎలా చెయ్యాలో అడగాలనే తహతహతో చుట్టుకుపోతున్నాడు. బస్సు వచ్చి ఆగింది.

"రండి ఎక్కేద్దాం!" అంటూ తాను ముందు ఎక్కేశాడు. ఆమె చువ్వ దొరకబుచ్చుకొని అతని వెనకే ఎక్కి లోనికెళ్ళి నిలబడింది. ఆమెతో చెప్పి టిక్కెట్లు తనే తీశాడు. పది నిమిషాల్లో బస్సు అనాథశరణాలయం ముందు ఆగింది.

తమ తమ సరంజామాతో కొందరు, ఖాళీగా కొందరూ దిగుతున్నారు. ఒకామె కుంటుకుంటూ వచ్చి "లతా ఒంటరిగా వస్తున్నావే! నీ కూడా వచ్చిన మేరీ ఎక్కడికెళ్ళింది?" అంటూ ప్రశ్నించింది. తర్వాత తనే కలుగచేసుకుని పక్కనున్న ఓంకార్‌ని చూస్తూ అనుమానంగా "ఈయనెవరే?" అని అడిగింది. ఓంకార్ కాలర్ ఎగరేస్తూ "మీ స్నేహితురాలికి రక్షణ ఇచ్చిన మగధీరుణ్ణి" అన్నట్లు పోజు ఇచ్చాడు. "లత పేరు చాలా బాగుంది ఈమెకు" అనుకున్నాడు. ఇద్దరూ దిగారు.

"పాపం! ఈయనే ఆపద్బాంధవుడిలా వచ్చి నాకు హెల్ప్ చేశారు. మేరీ చర్చి కెళ్ళొస్తానని వెళ్ళింది. ఈయన రుణం ఎలా తీర్చుకోవాలో" అంది తల వంచుకుంటూ.

"భలేవారే! మీలాంటి అందమైన వారు అడిగితే నేను కాదనటమా! ఇందులో రుణాలు తీర్చుకోవడం ఏవిటండీ! దటీజ్ మై డ్యూటీ!" అన్నాడు హీరోచితంగా.

"మరి నేను వెళ్ళొస్తానండీ! చాలా థ్యాంక్స్" అంది లత.

ఓంకార్‌కి ఆమెతో ఇంకా కాస్సేపు మాట్లాడాలని వుంది. పదే పదే ఆ మాటలు ఇంకా ఇంకా వినాలని వుంది. ఆమె చూస్తే వెళ్ళిపోతానంటోంది. సమయానికి బస్సు ఆగగానే ఈ కుంటి పిల్ల పానకంలో పుడకలా దాపురించింది. కొద్దిసేపు లతతో మాట్లాడాలనే నెపంతో "చూడండి లతగారూ! మీకభ్యంతరం లేకపోతే నా విజిటింగ్ కార్డు ఇస్తాను. నా వల్ల మీకు ఎప్పుడు ఎటువంటి అవసరం వచ్చినా నేను మీ వాడిననుకుని రావాలి. పైగా మీరెప్పుడొచ్చినా మా ఇంటి తలుపులు మీకోసం నిరంతరం తెరిచే ఉంటాయి" అంటూ ఒక చవకబారు సిన్మా డైలాగు వదిలి విజిటింగ్ కార్డు అమె చేతిలో పెట్టాడు.

లతకు కార్డు చేతిలో పెట్టినప్పుడు ఆమె అతని చెయ్యి తాకి మరీ తీసుకుంది. ఓంకార్ ఆ స్పర్శతో గింగిరాలు తిరిగిపోయాడు. ఆ కుంటి అమ్మాయిని ఏదోరకంగా తోలేసి లతతో మాట్లాడాలని ఓంకార్ "మేడమ్! మీరు మరోలా అనుకోకపోతే లతగారితో కొన్ని పర్సనల్ మేటర్లు మాట్లాడుకోవాలి" అన్నాడు. లత కంగారుపడింది.

ఆ కుంటి అమ్మాయి "నే వస్తా లతా" అంటూ పోబోయింది.

"నాతోటి పర్సనల్ మేటర్స్ ఏమిటి సార్?" అంటూ లత భయంగా ఓంకార్ని అడిగింది.

"అబ్బే! ఏమీ లేదండీ! ముందు మీరు ప్రతిసారీ నన్ను అండీ అనో, సార్ అనో అనడం మానేయాలి. లేకపోతే నన్ను చంపుకు తిన్నట్టే! ముద్దుగా ఓంకార్ అనండి చాలు"

"అలాగే ఓంకార్ గారూ! మరి నేనింక్ వెళ్ళిపోతాను. ఇప్పటికే చాలా టైమైపోయింది. భోజనం చెయ్యాలి. మళ్ళీ టైమ్ దాటితే భోజనం పెట్టరు. అన్నట్టు ఇప్పుడు టైమెంత సార్! ఓ... సారీ ఓంకార్ గారూ!" అడిగింది.

"అదీ అలా రండి దారికి. ఒకటీ ముప్పై నిమిషాలు. మీకు అభ్యంతరం లేకపోతే మనిద్దరం దగ్గరలోవున్న హోటల్‌కెళ్ళి భోజనం చేసొద్దాం! నా మాట తీసివేయకండి. ఇంతకీ మీరు వెజిటేరియనా! నాన్ వెజిటేరియనా! ఎందుకనో మీరు మాట్లాడుతుంటే మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తోంది. మీ స్నేహితురాలికి కూడా అభ్యంతరం లేకపోతే ఆమెనూ రమ్మనండి" అంటూ అడిగాడు.

లత కలుగచేసుకుని "మీరు మరీ చనువు తీసుకుంటున్నారు. ఇక్కడ మాకు కొన్ని నియమ నిబంధనలున్నాయి. ఆ ప్రకారమే పోవాలి తప్ప మన ఇష్టం వచ్చినట్లు చెయ్యగూడదు ఓంకార్ గారూ. ఇవ్వాళ మీతోబాటు తింటే రేపే మమ్మల్ని బైటికి తోలేస్తారు. అటువంటివేం పెట్టకండి సార్! నాకు భోజనానికి టైమవుతోంది. నడు పద్మా!" అంటూ ఆ కుంటి పిల్లను గాబోలు పిలిచింది.

**లత కలుగచేసుకుని "మీరు మరీ చనువు తీసుకుంటున్నారు. ఇక్కడ మాకు కొన్ని నియమ నిబంధనలున్నాయి. ఆ ప్రకారమే పోవాలి తప్ప మన ఇష్టం వచ్చినట్లు చెయ్యగూడదు ఓంకార్ గారూ. ఇవ్వాళ మీతోబాటు తింటే రేపే మమ్మల్ని బైటికి తోలేస్తారు. అటువంటివేం పెట్టకండి సార్! నాకు భోజనానికి టైమవుతోంది. నడు పద్మా!" అంటూ ఆ కుంటి పిల్లను గాబోలు పిలిచింది.**

ఆ అమ్మాయి లత దగ్గరకొచ్చి "ఏం వెళ్దామా! పాకం జీడిలా అంటుకుపోయాడు. దశకొద్దీ దొరికాడు బిస్కత్తుల మొగుడన్నట్టు అమెతో పాటు అనాథశరణాయలయం గేటువైపు నడకసాగించాడు. ఆ కుంటి పిల్ల తనను పాకంతో పోల్చినందుకు ఓంకార్ ఉడుక్కు చచ్చాడు. "కుంటి పీనుగా ఎంత మాటన్నావే" అంటూ ఆమెను తిట్టుకున్నాడు. గేటు దాటుతుండగా చేయి లతకు అందించి "జాగ్రత్తగా రా! అంటూ తాను లోనికడుగుపెట్టింది పద్మ.

లత గేటు దాటుతుండగానే చీర అంచు గేటు చువ్వకు చిక్కి చిరిగింది. అది తీసుకోబోతుంటే కళ్ళజోడు పక్కకు పడిపోయింది. పద్మ మళ్ళీ బైటకొచ్చింది. లత కళ్ళజోడు వెదుకుతుంటే పద్మ దాన్ని తీసి లతకు అందించింది. లత నిలబడగానే ఓంకార్ ఆమెను తేరిపారచూశాడు. ఆమె కంటి చూపు లేని కబోది. తన అవివేకానికి పిచ్చి పట్టినవాడిలా జుట్టు పీకున్నాడు. ఆమె అందచందాలు పైపై రంగులు చూసి వెంటపడి వచ్చిన తాను గుడ్డివాడా! కళ్ళు లేకపోవడం చేత ఆలోపాన్ని కనిపించకుండా కళ్ళకు నల్లద్దాలజోడు. ఆమె గుడ్డిదా?!ఓమైగాడ్? నిజంగా నేనే గుడ్డివాడిని, నా బుద్ధి గుడ్డిది. నా ఆత్మ సాక్షి గుట్టిది. నా కళ్ళు గుడ్డివి. మోహం, బాహ్యాసౌందర్యం తాలుకు తళుకు బెళుకులతో తబ్బిబ్బయ్యానే" అనుకుంటూ బుద్ధిని కట్టేసి తన దారిన తాను బయల్దేరాడు ఓంకార్.

★

**ఆరోగ్యం**

# గ్యాస్ ట్రబుల్ తగ్గేదెలా?!



**గ్యాస్ ట్రబుల్‌తో బాధపడేవారు మన చుట్టూ ఎంతోమందిని చూస్తున్నాం. వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది కూడా. తాత్కాలిక ఉపశమనానికి ఏవేవో బిళ్లలు వాడుతుంటారు. అసలు గ్యాస్‌ట్రబుల్‌కు ప్రధాన కారణం సరైన ఆహార నియమాలను పాటించకపోవడం. గ్యాస్‌ట్రబుల్‌ను తగ్గించుకునేందుకు మందులు వాడాల్సిన అవసరం లేదు. ఆహార నియమాలను పాటిస్తే మందుల జోలికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇది తగ్గుతుంది. అసలు గ్యాస్ ట్రబుల్ అంటే ఏంటి? ఏ వయసు వారికి వస్తుంది? ఎటువంటి ఆహారం తీసుకొంటే సమస్య వస్తుంది? చికిత్స, లక్షణాలు, కారణాలు, రాకుండా జాగ్రత్తలు వంటి కొన్ని విషయాల గురించి గతవారం తెల్సుకున్నాం. ఈ వారం మరిన్ని వివరాలు మీకోసం...**

స్కూలుకెళ్లే పిల్లలకు చూయింగ్ గమ్ నమిలే అలవాటు ఉంటుంది. దీన్ని నములుతున్నప్పుడు నోట్లోకి గాలి వెళ్తుంది. ఇలాంటి కొంతమంది పిల్లలు కడుపులో నొప్పిగా ఉందనీ, అజీర్తి చేసిందని గోలపెడుతుంటారు. చూయింగ్ గమ్‌తోపాటు గాలిని మింగడం వల్ల ఇలా జరుగుతుంది.

**వక్కపొడి, కిళ్లీ**

వక్కపొడి, కిళ్లీ నమిలే వాళ్లకూ కడుపులో గ్యాస్ తయారయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే వీటిని నములుతున్నప్పుడు కూడా గాలిని మింగడం జరుగుతుంది.

**డాక్టర్ ఎంజి జయన్**
**గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్**
**మెడిసిటీ హాస్పిటల్స్**
**హైదరాబాద్.**
**ఫోన్ : 9000177708**

**నోటి ద్వారా గాలిని వదలడం**

గ్యాస్ ట్రబుల్‌తో బాధపడేవాళ్లు నోటి ద్వారానో కింది నుంచో గ్యాస్‌ను బయటికి వదలడానికి ప్రయత్నించడం సహజం. నోటి ద్వారా అంటే త్రేన్పుల ద్వారా గాలిని బయటికి వదులుతున్నప్పుడు వీళ్లు నోటిని పూర్తిగా తెరుస్తారు. దీంతో బయటికి వదిలే గాలి తక్కువగా ఉంటుంది. కానీ మింగే గాలి మాత్రం అంతకంటే ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల గ్యాస్‌ట్రబుల్ మరింత ఎక్కువ అవుతుంది. త్రేన్పులు వచ్చినప్పుడు పెదాలను మూసి ఉంచడం మరచిపోకూడదు. తర్వాత నిదానంగా గాలిని బయటికి వదలాలి.

**గుండె-గ్యాస్‌ట్రబుల్**

గ్యాస్‌ట్రబుల్‌తో బాధపడేవాళ్లలో కొందరు గుండెలో బరువుగా ఉందని, మంట అని ఆందోళన చెందుతుంటారు. ఈ లక్షణాలు గుండెనొప్పికి సంబంధించినవిగా అనిపిస్తుంది. ఈ రెండు నొప్పుల మధ్య తేడా కనిపెట్టడం కష్టం. అందుకే నొప్పి వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదిస్తే ఆ నొప్పి దేనికి సంబంధించినదో చెబుతారు.

పాలుతాగే సీసా పీక మరీ చిన్నదిగానో, పెద్దదిగానో ఉంటే కూడా పిల్లలు గాలి మింగడానికి అవకాశాలుంటాయి.

**టీ కూడా..**

అజీర్తి, గ్యాస్‌ట్రబుల్‌కు మితిమీరి టీ తాగడం ముఖ్య కారణం. టీ పొడిని పది నిమిషాల కంటే ఎక్కువ మరిగిస్తే దీని నుంచి టానిక్ యాసిడ్, గాలిక్ యాసిడ్ ఉత్పత్తి అవుతాయి. ఇవి రెండూ అజీర్ణాన్ని కలిగించేవే. అందుకని టీ పొడిని ఎప్పుడూ మరగించకూడదు. ఇలాంటి హోటళ్లలో టీ తాగడం తగ్గించుకోవాలి.

టమాటా, ఉల్లిగడ్డలు, బీన్స్, గింజలు, పప్పుధాన్యాలు గ్యాస్‌ట్రబుల్‌ను తీసుకొస్తాయి. అయితే వీటిని అసలు తినవద్దని కాదు, మితంగా మాత్రమే తీసుకోవాలి.

**మిరపకాయ కూడా కారణం**

గ్యాస్‌ట్రబుల్‌కు మిరపకాయ ఒక కారణం. ప్రపంచంలో మిరపకాయ వినియోగంలో భారతదేశం ముందుండగా, అందులో మన రాష్ట్రానిదే అగ్రస్థానం. మన రాష్ట్రంలోనూ రాయలసీమలో మిరపకాయను ఎక్కువగా ఉపయోగిస్తారు. అందుకే గ్యాస్‌ట్రబుల్ ఉన్న వాళ్లలో వీళ్లే ఎక్కువ ఉంటారు. తరువాతి స్థానంలో తెలంగాణా, ఆంధ్రా ప్రాంతాలు ఉన్నాయి. తరచూ గ్యాస్‌ట్రబుల్‌తో బాధపడేవారు రకరకాల ఆహార పదార్థాల జోలికి వెళ్లకపోవడం మంచిది.

**చికిత్స**

గ్యాస్‌ట్రబుల్ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను కలవాలి. అవసరాన్ని బట్టి కొన్ని పరీక్షలు చేస్తారు. సరైన ఆహార నియమాలను పాటిస్తూ, మందులను వాడితే రెండు నెలల్లో గ్యాస్ ట్రబుల్ తగ్గుతుంది.

**రాకుండా ఉండాలంటే...**

గ్యాస్ ట్రబుల్ రాకుండా సమయానికి ఆహారం తీసుకోవాలి. తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవాలి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినకూడదు. మిరపకాయ బజ్జీలు, ఫాస్ట్‌ఫుడ్స్, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో లభ్యమయ్యే నిల్వ ఉన్న పదార్థాను తినకూడదు. నిమ్మ, నారింజ, చింతపండు ఎక్కువగా తీసుకోకూడదు. సిగరెట్లు, మద్యం మానేయాలి.

★

# అద్దాన్ని తుడుచుకొని చూడు!

- ఆశారాజు

హైదరాబాద్ నగరం
ఆదర్శ ప్రేమకు చిహ్నం
ప్రేమ కానుకగా యిచ్చిన
అపురూప స్వప్నం
ఒక ప్రేమికుడి 'షాను' కు
ఇది జిందా 'నిషానీ'

ప్రేయసి కోసం
నగరాన్ని నిర్మించిన పాదుషా
'అల్లా'ను ఇలా ప్రార్థించాడు

"చేపలతో చెరువును నింపినట్టు
మనుషులతో
నగరాన్ని నింపు" మని

'అల్లా' మంచి మనసు కోరిక విన్నాడు
హైదరాబాదును మనుషులతో నింపాడు
మనుషులకన్నా సౌందర్యవంతమైనది



ప్రపంచంలో ఏదీ వుండబోదు
కళకళలాడుతున్న హైదరాబాదును
ఎందుకు అసహ్యించుకొంటున్నావు?

అలలు లేని సముద్రం
కళేబరం లాంటిది
జనంలేని నగరం
చీకటి గుహ లాంటిది
నువ్వు కోరుకునే ఏకాంతం
కనిపించని విషసర్పం వెంటబడి కాటేస్తుంది.

విసుగు చెందిన మిత్రుడా!
మనుషులకు–
దూరంగా వుండాలనుకుంటే–
ఇంకా ఎడారి బతికే వుంది
పెళ్ళాంబిడ్డలతో అక్కడికెళ్ళి
ప్రశాంతంగా చావొచ్చు!

# భస్మాసుర సత్యం

- జి. లెనిన్ శ్రీనివాస్



వేకువ కోసం ఎదురేగిన
మధ్య తరగతికి మతిభ్రమించే షాక్
సరళీకరణ సంక్లిష్టతతో–
కుంభకోణాలు కృంగదీశాయి
ఆధారాలు అంతులేని దూరమై
సామాన్యులను సంక్షోభంలో నెట్టాయి
పారదర్శకత చూపులేని పరుగైంది!
గోల్‌మాల్ లెక్కలు గోతులు తీశాయి
సర్కారు రాయితీలు, నిధుల్ని నింపుకుని
కార్పోరేటు ప్రతిష్ఠ కాంక్రీటు పగుళ్ళైంది!
దండుకునేవాడికి దండిగా నిల్చి
అక్రమాలను నియంత్రించాల్సిన
నిఘా విభాగాలను నిద్రపుచ్చి
ద్రవ్య సంక్షోభంలోకి నెట్టి వేయబడిన ప్రగతి
ఒంటరై కుంటిదైంది!
బోర్డులు తిరగేస్తున్న బుద్ధిమంతులు
ప్రజల కలల్ని దోచేస్తూ.....
ప్రజాధనంతో విలాసాలలో తేలి
లెక్కకు మించిన భూముల్ని భోంచేస్తున్నారు.
యేలేవారి లాలనలో–
దోచుకునేందుకు ద్వారాలు తెరిచి
లేనోళ్ళను దోచి ఉన్నోళ్లకు కూడబెట్టడం
ఎన్నాళ్ళుగానో చూస్తున్న చిత్రం!
వెనకేసిన ఆస్తులను వెలికితీసి
రక్తికట్టిస్తున్న నాటకంలో–
పాత్రధారులను సూత్రధారులను శోధించి
భద్రతకు భరోసా కల్పించడమే సశేషం.....

# బీర్బల్ కథలు

మిగతా వచ్చేవారం...



## ఆ నాలుగు ఏవో...

**హాయ్**... అగ్గిపుల్లలతో డైమండ్ ఆకారం బాగుంది కదూ. అయితే వీటిలో నాలుగు పుల్లలు తీసి నాలుగు త్రిభుజాలు చేయాలి. మరి ఆ నాలుగు పుల్లలు ఎక్కడ తీయాలో చెప్తారా.

## ఎలా చేయొచ్చు?

**హాయ్** చిన్నారులూ... ఈ ఆరు గ్లాసుల్లో వరుసగా మూడింటిలో నీళ్లున్నాయి. మరో మూడు ఖాళీ గ్లాసులు. మీరు ఏంచేయాలంటే ఒక గ్లాసు తప్పించి మరో గ్లాసులో నీళ్లు ఉండేట్టుగా చేయాలి. కానీ ఒకసారి ఒక గ్లాసు మాత్రమే కదిలించాలి. ఎలాగో చేస్తారా మరి.

### జవాబులు

__తేడాలెక్కడ?:__ బక్కెట్ హ్యాండిల్, బక్కెట్ ముందున్న ఎముక, అబ్బాయి కాలు, అబ్బాయి పట్టుకున్నతాడు, గుర్రం తలపై జూలు.

__ఎలా చేయొచ్చు?:__ నీళ్లు నిండుగా వున్న మూడు గ్లాసుల్లో మధ్య గ్లాసులో నీళ్లు ఖాళీ గ్లాసులో పోస్తేసరి.



__ఒక్కోటి ఎలా?:__



__ఆ నాలుగు ఏవో...__



__సుడోకు?:__

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 6 | 2 | 4 | 3 | 8 | 7 | 9 | 1 |
| 4 | 7 | 3 | 2 | 9 | 1 | 5 | 8 | 6 |
| 1 | 9 | 8 | 7 | 5 | 6 | 4 | 3 | 2 |
| 2 | 5 | 9 | 6 | 7 | 3 | 8 | 1 | 4 |
| 7 | 1 | 6 | 5 | 8 | 4 | 9 | 2 | 3 |
| 8 | 3 | 4 | 9 | 1 | 2 | 6 | 7 | 5 |
| 3 | 4 | 7 | 8 | 2 | 5 | 1 | 6 | 9 |
| 6 | 8 | 1 | 3 | 4 | 9 | 2 | 5 | 7 |
| 9 | 2 | 5 | 1 | 6 | 7 | 3 | 4 | 8 |

## సుడోకు చేద్దామా...

హలో బుజ్జాయిలూ... కిందున్న పెద్ద బాక్సులో 9 చిన్న బాక్సులు వున్నాయి. మరలా ప్రతి బాక్సులో 9 గడులున్నాయి. వాటిలో ఒకటి నుండి తొమ్మిది వరకు అంకెలు వేయండి . అయితే ప్రతి చిన్న బాక్సులో కూడా ఒక అంకెను ఒక సారి మాత్రమే వాడాలి. చేయడం మొత్తం పూర్తయిన తర్వాత మా జవాబుతో సరి చూసుకోండి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 2 | | | 8 | 7 | | |
| | | 3 | | 9 | | | | |
| | 9 | 8 | 7 | | 6 | | | |
| 2 | | | 6 | 7 | | | | |
| 7 | | | | | | | | 3 |
| | | | | 1 | 2 | | | 5 |
| | | | 8 | | 5 | 1 | 6 | |
| | | | | 4 | | 2 | | |
| | | 5 | 1 | | | 3 | | |




నే
ర్చు
కుం
దాం





## తేడాలెక్కడ?

పిల్లలూ ఈ రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా వున్నా కానీ కొన్ని తేడాలున్నాయి. అవేంటో గుర్తించి చెప్పండి.

## ఒక్కోటి ఎలా...

హలో ఫ్రెండ్స్...ఇక్కడ ఏడు యాపిల్ పండ్లు వున్నాయి. వాటిని మూడు గీతలు మాత్రమే గీసి ఒక్కో గడిలో ఒక యాపిల్ మాత్రమే వుండేలా చేయాలి. ఏలానో తెలియకపోతే మా జవాబు చూడండే.



అట్టమీది కథ



# మధురఫలం

- కె. అంజన

అదొక పండు. పచ్చగా నిగనిగలాడుతుంది. ఎంచక్కా అరచేతిలో ఇమిడిపోతుంది. రుచి గురించి చెప్పాలంటే మాటలు చాలవు. తింటుంటే ఎక్కడికో వెళ్లిపోతాం. లోపల మాత్రం ఒక్కటంటే ఒక్కటే గింజ వుంటుంది. ఇంతకీ ఇది ఏం పండు?!

య్యస్...అది మధురఫలం మామిడిపండు. భూలోక అమృతఫలం. ఫలరాజం. అన్నిటినీ మించి మన జాతీయ పండు. ఇంకా చెప్పకోవాలంటే ఇది 'ఏకాంత ఫలం' అంటారు కొందరు పెద్దలు. అదేనండీ తింటుంటే చేతికీ, మూతికీ, ముక్కుకీ అవుతుందికదా. అది ఇతరులు చూస్తుంటే ఇబ్బందిగా వుంటుందని ...ఎవ్వరూ లేకుండా చూసి తినాల్సిన పండని ఆ మాటలోని పరమార్థం. కానీ మామిడి పండు రుచి ముందు అవన్నీ పట్టించుకుంటామా చెప్పండి. 'అయినా ఎదుటివాళ్లు మాత్రం తింటుంటే అలా అవదా ఏంటి?' అనుకొని తినేయడమే. ఏమంటారు?!

అటువంటి మధురఫలం మామిడి పండు చరిత్ర ఏంటి? ఇది ఎప్పటి నుంచి మనుగడలో వుంది? అసలు ఎక్కడి నుంచి ఏ దేశాలకు పరిచయమైంది? ఈ పండులో ఏ పోషకవిలువలు లభిస్తాయి? ఎన్ని రకాల మామిడిపళ్లున్నాయి? వాటి ధరల వివరాలేంటి? వంటి సంగతులన్నీ...ఈ వారం అట్టమీదికథలో మీకోసం ఇస్తున్నాం. ఆరగించండి మరి!

తాజా గడ్డ పెరుగు, అన్నంలో కొంచెం ఉప్పు కలుపుకొని మామిడి పండు నంజుకొని తింటుంటే వుంటుందీ... అదరహో అదరహ. కథల్లో, పురాణాల్లో వర్ణించిన స్వర్గసుఖాలన్నీ దీని ముందు రసవిహీనమైనవిగానే కనిపిస్తాయి. రాజులనూ, మహారాజులనే కాదండోయ్! విరాగులను సైతం రంజింపచేసిన ఫలం మామిడి. ముమ్మాటికీ ఇది ఫలరాజమే. జీవితంలో ఒక్కసారైనా దాన్ని రుచిచూడని బతుకు బతుకే కాదు. మన మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పుణ్యం కట్టుకొని వుండకపోతే జార్జిబెర్నార్డ్ షా బతుకులో ఒక వెలితి మిగిలిపోయి వుండేదేమో!

**ఈనాటిదా...!**

మామిడి రసం మూతి నిండా అయ్యి, చేతి వేళ్ల సందుల్లోంచి కారుతూ వుండగా, కళ్లు మూసుకుని మైమరచిపోయి తింటుంటాం కదా. ఆ అపురూప క్షణాల్లో...కనీసం ఒక్కసారైనా ఒక అనుమానం వచ్చి వుండాలి. 'అస్సలు ఇంత రుచిగల మామిడిపండు మనకు ఎప్పటి నుంచి తెలుసు?!' అని. అవునా! ఏముందండీ ...ఆగ్నేయ ఆసియాలో సింపుల్‌గా కొన్ని వేల సంవత్సరాల క్రితం నుంచి పండిస్తున్నారు. అప్పటినుంచి ఒక దేశం నుంచి మరొక దేశానికి పరిచయమౌతూ వచ్చింది. అసలు మామిడి ఎక్కడ పుట్టింది అనేదానిమీద ఇదమిద్ధంగా ఎవరూ ఇంత వరకు చెప్పలేదుగానీ...తూర్పు భారతం, బర్మా, అండమాన్ దీవులలోనే దాని మూలం వుండివుండాలని చెప్తుంటారు. క్రీస్తు పూర్వం ఐదవ శతాబ్దంలో బౌద్ధ సన్యాసులు మామిడిపండును మలేషియాకు, తూర్పు ఆసియాకు పరిచయం చేశారంటారు. పర్షియా వర్తకులు రసమయ మామిడిపండును ఆఫ్రికాకు, అక్కడి నుంచి పోర్చుగీసువారు బ్రెజిల్‌కు, వెస్ట్ ఇండీస్‌కు తీసుకెళ్లారంటారు. మొత్తం మీద అలా అలా ప్రపంచంలోని ఉష్ణదేశాలన్నింటినీ వ్యాపించింది మరి.

**రాజులు రారాజులూ మామిడిప్రియులే**

యుద్ధరంగంలోకి దిగాక శత్రువును గడగడలాడించే రాజైనా రారాజైనా మామిడిపండుకు సలాం కొట్టాల్సిందే. తల వంచాల్సిందే. మొఘల్ చక్రవర్తులూ అందుకు మినహాయింపు కాదండోయ్. దాని రుచి అలాంటిది మరి. జహంగీర్ మెప్పు పొందింది కాబట్టే ఒక జాతి మామిడిపండుకు 'జహంగీర్' అని పేరు వచ్చిందేమో! హుమయూన్ చేత భేష్ అనిపించుకుంది కాబట్టే ఒక రకం మామిడిపండు నాటికీ నేటికీ 'హుమయుద్దీన్'గా

మిగిలిందేమో! జహంగీర్ తండ్రి, అక్బర్ పేరు ఏ మామిడిపండుకు రాకపోయినా ఆయనకూడా మామిడి ప్రియుడే. ఓరోజు బీర్బల్‌తో కలిసి మామిడిపళ్ల పలహారానికి కూర్చున్నాడు. పండు తర్వాత పండు సుష్టుగా భోంచేసి టెంకలను మాత్రం బీర్బల్ ముందుకు నెట్టివేశాడు. తర్వాత టెంకలన్నీ లెక్కబెట్టి "బీర్బల్! నీవెంతటి కడుపాత్రపోడివోయ్! రెండు పరకలపళ్లు గుటుక్కుమనిపించావ్? జబ్బు చేస్తుందేమో సుమీ?" అని చమత్కరించాడు. అయినా హనుమంతుడి ముందు కుప్పిగంతులా? అన్నట్టు బీర్బల్ ముందా ఇలాంటి చమత్కారాలు? మాటకు మాట అప్పగించగల గడుగ్గాయి. 'చిత్తం స్వామీ! నేను కడుపాత్రపు వాడనే. అయినా, టెంకలను విడిచి పెట్టాను. దేవరవారు వాటిని కూడా చిత్తగించారు" అని చల్లగా చురక తగిలించాడు. మామిడిపండు రుచి తెలిసిన రసజ్ఞుడు కనుక అక్బర్ పాదుషా నొచ్చుకోక ఫక్కున నవ్వివుంటాడు.

పిల్ల రాజులైనప్పటికీ రాజభోగాలు అనుభవించిన మన జమీందారులు మామిడిపండు రుచి మరిగినవారు కావడంవల్లే పిఠాపురం, పెద్దాపురం, నూజివీడు, కార్వేటినగరం, బనగానపల్లి మామిడితోటలకు ప్రసిద్ధికెక్కాయి కాబోలు.

### ఎన్ని రకాలో!

మామూలుగా మనం మామిడి పండుగా పిలుస్తాంగానీ...అందులో ఎన్ని రకాలున్నాయో! ప్రపంచవ్యాప్తంగా దాదాపు వెయ్యి రకాల వరకు వున్నాయి. జహంగీర్, హుమయుద్దీన్, పంచదారకలశ, బెనీషా, బెంగుళూరియా, బంగినపల్లి, నీలం, కేసర్, రుమానీ, మల్‌గోవా, ఇమాంపసందు, సబ్జేసి, సువర్ణరేఖ, ఆల్ఫోన్సో, చిన్నరసం, పెద్ద రసం, చెరుకురసం, మంజీరా, దషేరి మహమూద, నిలేషాన్, అమ్రపాలి, లాంగ్రా, కొత్తపల్లి కొబ్బరి, ఫజిలి, చౌసా, కాజు, మల్లిక, రత్న, హిమాంపసంద్, అర్కపునీత్, సింధూ, రాయల్ స్పెషల్...ఇలా చెప్పుకుంటూ పోవచ్చు. కాకపోతే మనం ఏరకం పండునైనాసరే సింపుల్‌గా మామిడిపండు అనే పిలిచేస్తాం. తినేస్తాం.

### మామిడి మార్కెట్

మామిడిపళ్లను అత్యధికంగా పండించే దేశం మనదే. ప్రపంచం మొత్తంమీద ఉత్పత్తి అయ్యే మామిడిపళ్లలో 52 శాతం భారతదేశానివేనంటే నమ్ముతారా! మెక్సికో, చైనా రెండవ స్థానంలో వున్నాయి. తర్వాతి స్థానాన్ని మాత్రం పాకిస్తాన్, ఇండొనేషియా...ఆ తర్వాత థాయ్‌లాండ్, నైజీరియా, ఫిలిప్పైన్స్, హైతీ దేశాలు ఆక్రమించాయి. మరో విషయం ఏమంటే...మన దేశంలో మామిడి దిగుబడిలో ప్రథమ స్థానం మహారాష్ట్ర, రెండవ స్థానం మన రాష్ట్రానిదే. మన దేశం నుంచి మామిడిపళ్లు 80 దేశాలకు ఎగుమతి అవుతాయి.

మన రాష్ట్రంలో మామిడి మార్కెట్లుకు హైదరాబాద్ (గడ్డిఅన్నారం), విజయవాడ పేరుగాంచినవి. ప్రతి యేటా రాష్ట్రంలోని నూజివీడు పరిసరాలు, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, మెదక్, తూర్పు, పశ్చిమగోదావరి, కరీంనగర్ జిల్లాలనుంచి పెద్ద మొత్తంలో మామిడికాయలు గడ్డి అన్నారం మార్కెట్‌కు దిగుమతి అవుతాయి. ఇక్కడ గతేడాది టన్ను మామిడిపళ్ల ధర 14 వేల రూపాయలు పలకగా ఈ ఏడాది 18 వేల రూపాయలకు చేరింది. ధర పెరిగినప్పటికీ ఈ సంవత్సరం మామిడి దిగుబడి తగ్గిన దరిమిలా రైతు పెద్ద సంతోషంగా లేడు! నూజివీడు మార్కెట్లో గత ఏడాది టన్ను మామిడి ధర 20 వేల రూపాయలు పలికితే ఈ ఏడాది బంగినపల్లి ధర 15 వేల నుంచి 18 వేల రూపాయల వరకు మాత్రమే పలుకుతోంది. ఈ రెండు మార్కెట్ల నుంచి పొరుగు రాష్ట్రాలకు మామిడిపళ్లు











## కాయలు పళ్లు కావడానికి ఒక్క రోజు చాలు!

వేసవి వచ్చిందంటే చాలు పండ్ల రారాజు మామిడి కోసం తెగ ఎదురుచూస్తాం. ఎపుడెప్పుడు మామిడిపండు రుచి చూద్దామా అని కాచుకుని కూర్చుంటాం. చెట్టుమీదే పక్వానికొచ్చే వరకు వుంచితే సహజసిద్ధమైన తియ్యదనం మన సొంతమవుతుంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా పక్వానికి రాకుండానే కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. దాంతో మామిడికాయలను పండ్లుగా మార్చడానికి కృత్రిమ పద్ధతులు ఉపయోగిస్తున్నారు. గతంలో మామిడికాయలను బట్టీలలో పక్వానికి తెచ్చే పద్ధతులను పాటించేవారు. నిర్ణీత ఉష్ణోగ్రత వద్ద పండును మగ్గించాలంటే కనీసం 90 గంటల సమయం పడుతుంది. అందాక ఆగలేని వ్యాపారులు ఇప్పుడు రసాయనాలను వాడుతున్నారు. కాల్షియం కార్బైట్‌ను ఉపయోగించడం వల్ల కాయలు ఒక్క రోజులోనే పండ్లు అవుతున్నాయి. దీంతో తీపిని అందించాల్సిన మామిడిపళ్లు విషాన్ని చేరుస్తున్నాయి.



ఎగుమతి అవుతాయి.

### ఎన్ని ఉపయోగాలో!

పండుగయినా పబ్బమైనా, పెళ్లయినా, ఏ శుభకార్యమైనా వాకిట్లో మామిడితోరణం కట్టాల్సిందే. అది లేకుండా శుభకార్యమే లేదు. అంతేకాదు! దీన్ని ప్రేమకు చిహ్నంగా కూడా భావిస్తారు. మామిడిచెట్టు మనసులోని కోరికలను తీరుస్తుందని కొందరు భావిస్తారుకూడా. మన దేశంలోనే కాక భారత ఉపఖండంలో సైతం మామిడికి ప్రత్యేక స్థానం వుంది. ముఖ్యంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆగ్నేయ ఆసియాదేశాల్లో. మామిడి కాయల పచ్చడి గురించి తెల్సిందేకదా. వేసవి కాలంలో పట్టే ఈ పచ్చడికోసమే ఎంతోమంది ఎదురుచూస్తారనడంలో ఏమాత్రం అతిశయం లేదు. సంక్షోభం పుణ్యమా అని పెరిగిపోయిన ధరల నేపథ్యంలో దీని ప్రాధాన్యత మరింత పెరిగిపోయింది. ఒక్కసారి ఈ పచ్చడి పట్టేస్తే కూర వున్నా లేకపోయినా ఆ పూటకి నడిచిపోతుందనుకునేవారు ఎందరో. అంతేనా! మామిడి తాండ్ర, ఒరుగులు, జెల్లీ, జామ్, జ్యూస్ ...ఇలా చేస్తుంటాం. ఇంకా...మామిడికాయను పప్పులో పెడతాం. మామిడికాయ లేకుండా ఉగాది పచ్చడిని ఊహించలేం. మామిడికాయ పులిహోర రుచే రుచి. నోట్లో నీళ్లూరుతుండగా...తోతాపురి మామిడి ముక్కలమీద పల్చగా ఉప్పు, కారం అద్దుకుని తింటుంటే వుంటుందీ...సూపర్!

కేరళలో 'మంబ్జా కాలన్' తయారీలో పండిన మామిడిముక్కలను ఉపయోగిస్తారు. మహారాష్ట్రలో బెల్లం, మామిడి కలిపి 'మొరంబా' తయారుచేస్తారు. ఉత్తరభారతదేశంలో పచ్చిమామిడికాయలను ఉపయోగించి 'పన్నా' అనే డ్రింకును తయారుచేస్తారు. అంతేనా మామిడితో 'లస్సీ' కూడా చేసి లాగించేస్తారు. ఒకటి మాత్రం నిజం. మామిడిని ఉడకబెట్టి, ముక్కలు కోసుకొని, ఎండబెట్టుకొని, జ్యూస్ చేసుకొని, పచ్చడి వంటి రకరకాల రూపాల్లో

తినడం మనల్ని చూసే నేర్చుకోవాలెవరైనా!

కవుల వర్ణనలో మామిడి తప్పనిసరిగా వుండాల్సిందే. కుహూ కుహూ రాగాలతో మైమరపింపచేసే కోకిల కంఠస్వరం అంత తియ్యగా వుండడానికి కారణం అది కొరుక్కుతినే మామిడి చివుళ్లేనేమో! వేసవిలో మామిడి చెట్టుకింద మంచం వేసుకొని ఒక పుస్తకం పట్టుకొని చదువుకుంటుంటే మనసుకు ఎంత హాయిగా వుంటుందో కదా! బట్టల మీద మామిడిపిందెల డిజైన్లు ఎన్నెన్ని రకాలు కనిపిస్తాయో. వందల సంవత్సరాల క్రితం చెక్కిన సోమనాథ్‌పూర్, తల్కాడ్, బేలూర్, హలెబిడ్, మహాబలిపురం, పట్టడకల్ వంటి అనేక ఆలయాలను పరిశీలిస్తే...స్థంభాల మీద, గోడలమీద మామిడి కాయలు, తీగల ఆకారాలు స్పష్టంగా కనిపిస్తాయి.

### చిన్నారుల తొలి చిత్రం

మీరు మీ బాల్యాన్ని గుర్తు చేసుకున్నా సరే. లేదా మీ పిల్లలను పరిశీలించినా సరే! ఒక విషయం తెలుస్తుంది. బొమ్మలు గీయడం మొదలెట్టిన చిన్నారుల తొలి చిత్రం మామిడిపండే. సులభంగా, త్వరగా అయిపోతుంది. అందుకే వాళ్లకి మామిడి పండు బొమ్మంటే అంత ఇష్టం. చక్కగా నేలమీద వాలిపోయి తెల్ల కాగితం మీద పెన్సిల్‌తో మామిడిపండు బొమ్మ వేసి, క్రేయాన్లతో పసుపు, ఎరుపు రంగులు అద్దేసి మైమరచిపోయి చూసుకునే చిన్నారులు ఎంత ముద్దుగా కనిపిస్తారో కదా!

### అంతర్జాతీయ మామిడి పండుగ

ప్రతి సంవత్సరం జూన్ జులై మాసాల్లో ఢిల్లీలో రెండు రోజులపాటు జరిగే ఈ పండుగకు విదేశీయులు సైతం వస్తారు. అక్కడ ప్రదర్శించే 500 రకాల మామిడిపళ్లను రుచి చూసి ఆనందిస్తారు. 1987వ సంవత్సరం నుంచి ఈ పండుగను జరుపుకుంటున్నారు. మన దేశం నలుమూలల్లో పండించిన ... ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్, ఢిల్లీల్లో పండించిన మామిడిపళ్లు ఇక్కడకు చేరుకుంటాయి. మామూలుగా నాలుగైదు రకాల మామిడిపళ్లను మాత్రమే రుచి చూసిన సందర్శకులకు నిజంగా ఇదొక పండుగే. అక్కడ నిర్వహించే క్విజ్‌లు, పోటీలు మామిడిపళ్ల రకాల గురించిన సమాచారం అందిస్తాయి. మామిడి ఎగుమతులను పెంచడం, పర్యాటకులను ఆకర్షించడం ఈ పండుగ ప్రధాన ఉద్దేశ్యం. పచ్చళ్లు, జామ్‌లు, స్క్వాష్‌లు వంటి మామిడి ఉత్పత్తుల ప్రదర్శనకు మంచి అనువైన వేదిక ఇది. అంతేనా! మహిళలకు మామిడిపళ్ల తినే పోటీ కూడా నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. మేంగో కార్వింగ్ పోటీలు కూడా పెడతారు. అంతేకాదండోయ్ అతి పెద్ద మామిడిపండు పండించిన వారికి ప్రత్యేకమైన బహుమతి కూడా అందిస్తారు.

### ఎలాంటివి ఎంచుకోవాలి?

మామిడిపండు కొనేటప్పుడు ఒక విషయం గుర్తుంచుకోవాలి. తాజాతనంతోపాటు అక్కడక్కడా నల్లటి చుక్కలు వుంటే మంచిపళ్లన్నమాట. అంతేకాదు! పండు మరీ గట్టిగానూ, మరీ మెత్తగానూ వుండకూడదు. మామిడిపండు కొద్దిగా వడిలినట్టు...ముడుచుకున్నట్టు కనిపిస్తే... కొనకపోవడమే మంచిది. లేతగా వున్నప్పుడే కోసి మందులు చల్లి పండించిన కాయలని గుర్తుంచుకోవాలి. మగ్గిన పళ్లకంటే వీటిలో పోషకవిలువలు కూడా తక్కువగానే వుంటాయి.

★

## మామిడిపండు-పోషక విలువలు



మామిడిపండు పోషక విలువల్లో 94 శాతం పిండి పదార్థం, 3 శాతం కొవ్వు, 3 శాతం మాంసకృత్తులు వుంటాయి. అంతేకాదు 20 రకాల విటమిన్లు, లవణాలు లభిస్తాయి. విటమిన్ 'సి, ఎ' అత్యధికంగా అందుతాయి. విటమిన్ 'సి' రోగనిరోధక శక్తిని మెరుగుపరిస్తే... విటమిన్ 'ఎ' కంటి చూపుకు, ఎముకల వృద్ధికి తోడ్పడుతుంది. ఒక కప్పు (సుమారు 165 గ్రాముల) మామిడి ముక్కల్లో... 107 కేలరీల సమానమైన పోషక విలువలుంటాయి. ఇది రోజుకు కావాల్సిన కేలరీల్లో దాదాపు 5 శాతం అవసరాలను తీరుస్తుంది. దానిలో 101 కేలరీల విలువగల పిండి పదార్థం, 3.7 కేలరీల విలువగల కొవ్వు పదార్థం, 2.8 కేలరీల విలువగల మాంసకృత్తులు వుంటాయి.



★ రోజుకు కావాల్సిన పోషక పీచు అవసరంలో 12 శాతం వరకు దాని ద్వారా అందుతుంది.

★ విటమిన్ 'సి' 45.7 మి.గ్రా వుంటుంది. రోజు అవసరంలో 75 శాతం వరకు ఇది అందిస్తుంది.

★ విటమిన్ 'ఎ' 12.6 మిల్లీ గ్రాముల వరకు వుంటుంది. రోజు అవసరంలో ఇది 25 శాతం వరకు అందిస్తుంది.

★ విటమిన్ 'బి 6' 0.2 మిల్లీ గ్రాముల వరకు వుంటుంది. రోజుకు అవసరమైన దానిలో 11 శాతం వరకూ ఈ మామిడి ముక్కలు తీరుస్తాయి.

★ ఇవి కాక విటమిన్ 'ఇ, కె' కూడా గణనీయమైన పరిమాణంలోనే వుంటాయి.

★ కాల్షియం (16.5 మిల్లీ గ్రాములు), భాస్వరం (18.2 మిల్లీ గ్రాములు), ఇనుము (0.2 మిల్లీ గ్రాములు), మెగ్నీషియం (14.8 మిల్లీ గ్రాములు), రాగి (0.2 మిల్లీ గ్రాములు) ఈ మామిడి ముక్కల ద్వారా మనకు అందుతుంది.

★ పైగా దీనిలోని కేలరీలు అత్యధికభాగం పిండిపదార్థాల రూపంలో వుంటుంది. అందుకే తినగానే త్వరగా రక్తంలో కలిసిపోతుంది. అందుకే మధుమేహవ్యాధి వున్నవారు మామిడిపండును తినకూడదు.

# నా పిల్లలకు ఆస్థి రావాలంటే...

నేను గవర్నమెంటు ఉద్యోగిని. నాకు ఇద్దరు పిల్లలు. 1991వ సంవత్సరంలో ఇంటి స్థలం కొన్నాను. 2000 సంవత్సరంలో ఇల్లు కట్టాను. నాదగ్గరవున్న డబ్బుగాక ఆంధ్రా బ్యాంకులో 2,00,000 రూపాయలు లోను తీసి ఇల్లు కట్టాను. బ్యాంకు మేనేజరుగారు "మీ పేరుతో ఇంటి స్థలం లేదు. మీ ఆయన ఒక్కరి పేరుతోనే ఉంది. కనుక ఇల్లు మీ పేరు మీద మార్చుకోండి" అని సలహా ఇచ్చారు. కాని మా ఆయన నా మాట వినలేదు. అది పూర్తవగానే ఇల్లు అద్దెకు ఇచ్చాడు. 3 సంవత్సరాల్లో బ్యాంకు లోను తీర్చాశాను. 2005వ సంవత్సరంలో ఆ ఇంటి మీద ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకొని నాకు కోర్టు నోటీసు ఇచ్చాడు. అది నా సొంతం. దాని మీద నీకు కాని, పిల్లలకు కాని ఎలాంటి హక్కు లేదన్నాడు. కనుక ఇప్పుడది కోర్టులో జరుగుతోంది. అసలు ఇది నాకు వస్తుందా! బాబుకి 18 సంవత్సరాలు వచ్చాయి. బాబు సంతకం లేకుండా ఇల్లు అమ్మటానికి కుదురుతుందా! దయచేసి నాకు సలహా ఇవ్వండి. ఇదేకాక వాళ్ళ నాన్నగారి పొలం రెండు ఎకరాలు వుంది. అది ఎవరికో అమ్మేసినట్లుగా కాగితాలు సృష్టించి నాకు ఏ పొలం లేదని నాకు నోటీసులు పంపాడు. తనకి నా దగ్గర నుంచి విడాకులు కావాలి. నాకు కాని పిల్లలకు కాని ఏమి చెందకుండా చెయ్యాలని అతని ఉద్దేశం. మా పిల్లలకు ఏవిధంగా ఆ ఆస్తులు వస్తాయి? అసలు వీళ్ళ సంతకం లేకుండా ఏ విధంగానైనా ఆ ఆస్థులు తను స్వాధీనంచేసుకొవచ్చా? నేను కోర్టు చుట్టూ తిరగలేను. పిల్లలకు వస్తే చాలు. నాకు అక్కర లేదు. అతను మరో పెళ్ళి చేసుకుండే పిల్లలకు ఆస్థులు ఏ విధంగా వస్తాయి? ఇల్లు మాత్రం నా సొంత డబ్బుతోనే కట్టాను. విషయాన్ని దయచేసి ఓపికగా చదివి అర్థంచేసుకొని నాకు సరైన సమాధానం ఇవ్వండి.

దేవి, ఆచంట.

**జి ఎల్ నరసింహారావు,** అడ్వకేట్,
3-4-778 నుండి 780/1,
బి-002, ప్రసాద్ ఎన్‌క్లేవ్,
బర్కత్‌పురా రోడ్,
హైదరాబాద్


బ్యాంకు వాళ్ళు మీ పేరిట లోన్ శాంక్షన్ చేశారు కావున ఆ లోను పత్రాలు, మరియు మీరు ఎప్పుడు డబ్బులు కట్టారు? ఆ సందర్భంలో మీరు బంగారం అమ్మినట్లుగా వేరే విధంగా డబ్బులు పోగు చేసినట్టుగా ఆధారపత్రాలు ఉంటే మీరు ఆయనపై సివిల్ దావా వేసుకోవచ్చు. డబ్బులుగాని, ఆ ఇంట్లో వాటాగాని కోరవచ్చు. అలాంటి ప్లాట్ ఆయన సొంతమైతే పిల్లలకు వాటా రాదు. తాతల ఆస్థి అయినట్లయితే అడగవచ్చు. పొలం అన్నారు. అది కూడా తాత ఆస్థిలో హక్కుగా పిల్లలకు ఉంటుంది. అతడు అమ్మినా కోర్టులో దావా వేసి మీరు పొందవచ్చు.

# అన్న ఆస్థి ఎవరికి వస్తుంది?

1979వ సంవత్సరంలో మా అన్నదమ్ములిద్దరం కలిసి ఒక కుంట స్థలం కొన్నాం. ఈ స్థలం హక్కుదారులుగా మా ఇద్దరి పేర్లు సబ్‌రిజిస్టర్ ఆఫీసులో నమోదు అయినాయి. ఈ స్థలం ఒరిజనల్ పత్రాలు మా అన్న దగ్గర ఉన్నాయి. ఈ కుంట స్థలం సగభాగంలో మా అన్న ఇల్లు కట్టుకున్నాడు. మిగిలిన సగభాగంలో నేను ఇల్లు కట్టుకున్నాను. మా అన్న ఇంట్లో కింద భాగం పైభాగం ఉన్నాయి. కింద నాలుగు గదులలో మా అమ్మ, మా నాన్న ఉన్నారు. పైభాగంలో మా అన్న, వదిన ఉన్నారు. నాభాగంలో నేను, నాభార్య పిల్లలు ఉన్నాము. 1990 సంవత్సరములో నేను మా అన్న ఒక ఒప్పంద పత్రం రాసుకున్నాము. దాని ప్రకారం మా అమ్మను మా అన్న బతికి నన్నాళు చూస్తానని చెప్పి నా దగ్గర 50,000 తీసుకొన్నాడు. తర్వాత మా అన్న రవి చనిపోయాడు. మా వదిన మా అమ్మకి కావలసిన సౌకర్యాలు కల్పించలేదు. మా అన్నకు బిడ్డలు లేరు. ఎవరిని దత్తత తీసుకోలేదు. మా అన్న ఎటువంటి వీలునామా రాయలేదు. మా అన్న ఆస్థి ఎవరికి వస్తుంది?

రవి, ముషీరాబాద్.

మీ ఇద్దరు సోదరులు కలిసి ఇంటి జాగా కొన్నారు కావున అది ఇరువురి స్వార్జితం. మీరు తల్లిని చూడడంకోసం అన్నకు 50,000 ఇచ్చారు. మీరు చెప్పిన ప్రకారమైతే అతను బతికినన్నాళ్ళు చూస్తానన్నారు. అలాగే బతికినన్నాళ్ళు చూసినట్లేగా. కావున ఆ అంగీకార పత్రంలో మీకు వచ్చేది ఏమీలేదు. అన్నగారి ఆస్థికి మీ వధిన వారసురాలవుతుంది. కావున అటువంటి ఆస్థి ఆమెకే చెందుతుంది. మీ అమ్మగారికి హక్కులేమీ సంక్రమించ లేదుకదా! విలునామా ప్రకారం దావా వేయొచ్చు. కాని ఫలితముండక పోవచ్చు.

★

## నవ్వుల్ - పువ్వుల్

### అందం

**మహేంద్ర :** నీకు పెళ్లయ్యాక ఇప్పుడేరా కలవడం. ఎలా ఉంది నీ లైఫ్?

**మాధవరావు :** ఆదేంటోరా! పెళ్లికి ముందు అందరాడాళ్లకన్నా నేను చేసుకోబోయే అమ్మాయి అందంగా కనిపించేది. పెళ్లయ్యాక నా భార్య తప్ప ఆడాళ్లందరూ అందంగా కనిపిస్తున్నారు.

### ఉండ్రాయి

**డాక్టర్ :** మీ ఆయన్ని ఏ రాయితో కొట్టారు? ఇంత పెద్ద బొప్పి కట్టింది!

**వనజ :** అబ్బే రాయా పాడా! వినాయక చవితికి చేసిన ఉండ్రాయితో డాక్టర్.

### అడ్రసు

**డాక్టర్ :** మీ జబ్బు ఇక నయం కాదు. మిమ్మల్ని ఆ దేవుడే కాపాడాలి.

**పేషెంట్ :** పోనీ, అతడి అడ్రస్సే చెప్పండి డాక్టర్. అక్కడికే వెళ్లతాను.

★

## చింతచిగురు పప్పు

**కావలసిన పదార్థాలు**

కందిపప్పు - 50 గ్రాములు,
చింతచిగురు - 50 గ్రాములు,
నూనె - 10 గ్రాములు
వెల్లుల్లి - 4 రెబ్బలు, ఆవాలు - 1/4 చెంచా
జీరా - 1/4 చెంచా, పసుపు - 1/4 చెంచా
కరివేపాకు - 2 రెమ్మలు, కొత్తిమీర - కొంచెం
ఇంగువ - చిటికెడు, పచ్చిమిర్చి - 4 (సన్నగా పొడుగ్గా కోసుకోవాలి), ఉప్పు - తగినంత

**తయారుచేసే విధానం**

ముందుగా కందిపప్పును కుక్కర్లోగాని, విడిగాగాని మెత్తగా వుడకనివ్వాలి. చింత చిగురు పుల్లలు లేకుండా ఏరుకొని, రెండు అరచేతుల్లోకి తీసుకొని సున్నితంగా రుద్దాలి. ఆకు కొంచెం నలిగి, పొడి పొడిగా వస్తుంది. అలా శుభ్రం చేసి వుంచుకోవాలి. దీన్ని కందిపప్పులో పూర్తిగా కలిసిపోయే వరకు వుడకనివ్వాలి. స్టవ్ మీద బాండీ వుంచి నూనె పోసి బాగా కాగాక, ఆవాలు, జీరా, వెల్లుల్లి, ఇంగువలతో (ఇష్టమైతేనే), కరివేపాకు వేసి, చింత చిగురు పప్పులో తాలింపు వేయాలి. చింతచిగురు పప్పు తయార్.

## సొరకాయ దోసె

ఇది పిల్లలు, పెద్దలు ఇష్టంగా తినే వంటకం. సొరకాయ కూరకే కాక టిఫిన్‌గా కూడా ఎలా వుపయోగించుకోవాలో చూద్దాం.

**కావలసిన పదార్థాలు**

సొరకాయ - ఒకటి (చిన్న సైజ్),
బియ్యం పిండి - పావుకిలో , ఉప్పు - తగినంత
పసుపు - 1/2 చెంచా, పచ్చికారం - 1/2 చెంచా, పచ్చిమిర్చి - 2 , అల్లం - చిన్న ముక్క,
నూనె - 100 గ్రాములు, కరివేపాకు - 2 రెమ్మలు

**తయారు చేసే విధానం**

ముందుగా బియ్యం పిండి రెడీ చేసుకోవాలి. అప్పటికప్పుడు (నిల్వ కానిది) దంచినది కాని, మరపట్టించుకున్నదయినా ఫలవాలేదు. సొరకాయ శుభ్రంగా కడిగి చెక్కు తీయకుండానే పెద్ద పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. ఎండు కొబ్బరి కోరుతో తోలుతో సహా కోరుకోవాలి. కోరుకు ఒక చిటికెడు ఉప్పు కలపుకోవాలి. బియ్యం పిండిలో తరిగిన కోరు, పసుపు, కారం, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు కరివేపాకు, తగినంత ఉప్పు కూడా కలిపి నీళ్ళుపోసి అట్లపిండిలా జారుగా కలుపుకోవాలి (మరీ పల్చగా కాక, మరీ గట్టిగా కాకుండా వుండాలన్నమాట). ఒక పది నిముషాలు నానితే చాలు. పొయ్యి మీద మందపాటి అట్లపెనం పెట్టి కొద్దిగా నూనె రాసి దోసెలు పోయండి. కరకరలాడే సొరకాయ దోసెలు రెడీ.





## కాకరకాయ పులుసు

**కావలసిన పదార్థాలు**

కాకరకాయలు - 1/4 కిలో, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి - 4, చింతపండు - 50 గ్రాములు , ఉప్పు, కారం - తగినంత,
నూనె - 50 గ్రాములు,
తాలింపు గింజలు - 1 చెంచా, కరివేపాకు,
కొత్తిమీర - తగినంత, బెల్లం - తగినంత

**తయారుచేసే విధానం**

ముందుగా కాకరకాయలు శుభ్రం చేసుకొని మరీ చిప్స్‌లా కాక, మరీ లావుగా కాకుండా గుండ్రంగా తరుక్కోవాలి. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి చిన్న చిన్న ముక్కలుగా తరుక్కోవాలి. చింతపండు శుభ్రంగా కడిగి వేడినీళ్ళలో నానబెట్టి గుజ్జులా చేసి వుంచుకోవాలి. స్టవ్ మీద బాండీగాని, కాస్త లోతయిన అడుగు మందం వున్న గిన్నె గానీ వుంచాలి. దాంట్లో నూనెపోసి కాగాక, తాలింపుగింజలు, కరివేపాకు, పసుపు వేసి ఉల్లి ముక్కలు, మిర్చి ముక్కలు వేసి కొద్దిగా వేగనివ్వాలి. తర్వాత కాకరకాయ ముక్కలు కూడా వేసి బాగా వేయించాలి. ముక్కలు కొంచెం మెత్త పడ్డాక తీసి ఉంచుకున్న చింతపండు పులుసు కూడా వేసి, కొంచెం నీళ్ళు చేర్చి ముక్కలు బాగా పులుసులో వుడికే వరకు వుంచాలి. తగినంత ఉప్పు, కారం వేసి దించేయాలి. దించబోయే ముందు మెత్తగా చిదిమిన బెల్లం కూడా వేసి రెండు పొంగులు రానిచ్చి దింపేయాలి. కాకరకాయ పులుసు రెడీ.

## సొరకాయ పాలకూర

**కావలసిన పదార్థాలు**

సొరకాయ -1 లేతది, పచ్చిమిర్చి - 6 (నిలువుగా చీరాలి),
పాలు - 1 కప్పు, ఆవాలు - 1/2 చెంచా,
పచ్చిశనగపప్పు - 1 చెంచా, జీరా - 1/2 చెంచా (మెత్తగా నూరాలి),
మిరియాలు - 1/2 చెంచా (మెత్తగా నూరాలి), పసుపుపొడి - చిటికెడు,
ఉప్పు - తగినంత, నూనె - తగినంత (షుమారు 25 గ్రాములు),
కరివేపాకు, కొత్తిమీర - తగినంత

**తయారుచేసే విధానం**

ముందుగా సొరకాయ చెక్కు తీసి చిన్న చిన్న ముక్కలుగా తరుక్కోవాలి. బాండీలో నూనె పోసి కాగాక తాలింపు వేయాలి. కోసి వుంచిన మిరపకాయలు వేసి వేయించాలి. తరువాత పసుపు, సొరకాయ ముక్కలు వేసి బాగా వేయించాలి. ముందుగా చేసుకున్న జీరా పొడరు, మిరియాల పొడి వేసి అర కప్పు పాలు కలిపి మూత పెట్టాలి. అయిదు నిమిషాలు అవగానే మిగిలిన పాలు కూడా పోసి దించేయండి. సొరకాయ పాల కూర రెడీ.



## చూద్దామా



# అలనాటి మహావిద్యాలయం నలంద

**ఒకనాడు మహావిద్యాలయాలుగా అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన దేశదేశాల జిజ్ఞాసువులను ఆకర్షించిన ప్రదేశాలు నలంద, తక్షశిల. తక్షశిల ఇప్పుడు పాకిస్తాన్‌లో వుంది. నలంద బీహారులో వుంది. ఇది మహా విజ్ఞాన పీఠమే కాదు, బుద్ధుడు మహావీరుని జీవితాలతో ముడిపడిన పుణ్యభూమి. బుద్ధుని ప్రవచనాలెన్నో ఇక్కడ జరిగాయి. వర్ధమాన మహావీరుడిక్కడ 14 చాతుర్యాశ్యాలు చేశాడట. అదీకాక బుద్ధుని ప్రియశిష్యుడైన శారిపుత్రుని జన్మస్థలం నలంద. ఆనాడిక్కడ విరిసిన ప్రకృతి సౌందర్యంతో, దేశవిదేశాల జనసందోహంతో, పరిపూర్ణులైన ఆచార్యులతో, రాజాదరణతో లభించిన భోగభాగ్యాలతో, విజ్ఞాన వికాసాలతో కళకళలాడుతూండేది నలంద.**

**హు**యాన్‌త్సాంగ్ నలందనూ, ఇక్కడి విశ్వవిద్యాలయాన్ని వర్ణిస్తూ... అత్యంత రమణీయమైన పర్వత శిఖరాలిక్కడ గుమిగూడినట్లుండేవనీ, రాజగృహానికొక యోజనదూరంలో వున్నదని పేర్కొన్నాడు. ఆనాటికే ఇక్కడ ఒక మడుగులో నలంద అనే పేరుగల వాగు వుండటం వల్ల దీనికీ పేరు వచ్చిందనే కథ ప్రచారంలో వుండేది. తారానాథుని కథనం ప్రకారం అశోకుడు నలందలో శారిపుత్రుని చైత్యానికి విరివిగా దానాలిచ్చిన ఒక మందిరం కూడా నిర్మించాడని, కనుక నలంద విహార నిర్మాణం అశోకుని కాలంలో ఊపందుకున్నదని భావించవచ్చు. ఉన్నత విద్యకూ పరిశోధనలకూ నిలయమై 700 సంవత్సరాలు వైభవంగా విలసిల్లిన ఈ విజ్ఞానకేంద్రానికి దేశీయులే కాక చైనా, జపాన్, కొరియా, మంగోలియా, టిబెటన్లు, శ్రీలంక నుంచి విద్యాన్వేషకులు తరలి వచ్చేవారు. ప్రతి ఐదుగురు విద్యార్థులకు ఒక ఆచార్యుడుండేవాడు. ఇలా 12 వేల మందికి ఇక్కడ విద్య, వసతి సౌకర్యాలేర్పరచాలంటే ఇది ఎంత అద్భుతమైన వ్యవస్థ. ఇంతటి వైభవంతో 7 శతాబ్దాలపాటు వెలుగులు విరజిమ్మింది నలంద. మానవ నాగరికతలో ఇదొక అద్భుత ఘట్టం. మహాయాన శాఖకు చెందిన నాగార్జునుడు క్రీస్తు శకం 2వ శతాబ్దంలో ఇక్కడ అధ్యయనం ప్రారంభించి రసశాస్త్ర ప్రవీణుడై ఇక్కడే ప్రథమాచార్యుని పదవిని అలంకరించాడు. ఈయనకు సమకాలీనుడు సువిష్ణుడనే బ్రాహ్మణుడు ఇక్కడ 108 మందిరాలు నిర్మించి బౌద్ధధర్మం క్షీణించకుండా కాపాడాడట. బౌద్ధంలో మాధ్యమిక శాఖకు చెందిన ఆర్యవేదుడు, యోగాచార శాఖకు చెందిన అసంగుడు ఇక్కడ చిరకాలం అధ్యయనం చేశారని తారానాథుని కథనం. తరువాత అసంగుని సోదరుడు వాసుబంధుడు ప్రథమాచార్యుడైనాడు. నాగార్జుని కాలానికే 500 సంవత్సరాల ఉజ్వల చరిత్రగల నలంద, తరువాత 2 శతాబ్దాల పాటు తన వైభవాన్ని నిలుపుకోగలిగింది.

ఇక్కడి తవ్వకాలలో గుప్తులకు పూర్వం నిర్మించిన కట్టడమేదీ బయల్పడలేదు. హుయాన్‌త్సాంగ్ కథనం, ఆనాడీ ప్రాంతపు మహారాజు శక్రాదిత్యుడు ఇక్కడొక విహారాన్ని నిర్మించాడనీ, తరువాతి మహారాజులు బుద్ధగుప్తుడు, బాలాదిత్యుడు, వజ్రుడు ఇక్కడనేక విహారాలు నిర్మించారనీ, ఇక్కడ 75 అడుగుల ఎత్తున్న బుద్ధవిగ్రహాన్ని పూరవర్మ ప్రతిష్ఠించాడనీ, కనౌజ్ రాజైన హర్షవర్ధనుడు ఇక్కడొక విహారం నిర్మించి 100గ్రామాలు మాన్యంగా ఇచ్చాడని పేర్కొన్నారు. ఈ విజ్ఞాన కేంద్రానికి ప్రజాదరణ కూడా ఏస్థాయిలో వుండేదంటే ఈ పరిసర గ్రామాలలో 200 మంది గృహస్థులు ఇక్కడకు కావలసిన నిత్యావసర వస్తువులు సమర్పించేవారు. ఇక్కడ విద్యార్థులూ, ఆచార్యులూ వారి నిత్యావసరాలకు వెదుక్కోనవసరం లేకుండా విద్యావ్యాసంగమే ధ్యేయంగా శతాబ్దాల పాటు, జ్ఞానసాగరాన్ని మథించారు. నిరంతరం ఉదారంగా సాగిన రాజపోషణతో ఇక్కడొక సుందర సువిశాలమైన నిర్మాణ సముదాయం రూపుదిద్దుకుని, సువర్ణానికి సుగంధమబ్బినట్లు పాండిత్యానికి శిల్పకళావైభవానికీ నిలయమై భాసించింది నలంద.

### నలంద గుర్తింపు

ఇక్కడున్న చిన్న గ్రామం బారాగావ్‌లో 1860 ప్రాంతంలో అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ నలంద మహావిహారాన్ని గుర్తించాడు. ఇది చైనా యాత్రికులిచ్చిన దిక్కులు, దూరాలు, ఇక్కడ లభించిన శిలాఫలకాలు, విగ్రహాలు బైటపడ్డ శిథిలాల ఆధారంగా జరిగింది. తరువాత ఎ.ఎమ్ బ్రాడ్లీ ఇక్కడ తవ్వకాలు సాగించాడు. 1915-16 నుండి ఇక్కడ



నలంద మహావిహారం





నలందలో బోధివృక్షం

నలందా మ్యూజియం

పురాతత్వశాఖవారు తవ్వకాలు జరిపి ఎన్నో విశేషాలు వెలుగులోకి తెచ్చారు. ఇలా ప్రాచీన సంస్కృతిపట్ల అభిమానులకు ఇదొక యాత్రాస్థలంగా మారింది. ఇక్కడ శిథిలాల్లో మొదట చెప్పుకోవలసింది ప్రధానాలయం గురించి. అయితే ఆవరణ మధ్యలో బ్రహ్మాండమైన రాతిగోడలు మాత్రమే ఇప్పుడు మిగిలాయి. ఇక్కడ లభించిన శిల్పాలలో గృహజీవితంలోని దైనందిన కృత్యాలు, నాట్యకత్తెలు, లతాకుసుమాలు కనిపిస్తాయి. చుట్టూ అనేక స్థూపాలున్నాయి. చాలావరకు ఒకటి శిథిలమైతే దానిపైన మరొకటి నిర్మించారు. చిన్న ఆలయాలు శిథిలమైతే వాటిపైన మరింత పెద్దాలయాలు నిర్మిస్తూ వచ్చారు. ఇప్పుడు కనిపిస్తున్న ప్రధానాలయ శిథిలాలు ఏడోసారి నిర్మించిన ఆలయానివి. ఉత్తర దిశగా కన్పించే మెట్లు 5,6,7వ కట్టడాలవి. ఐదవ కట్టడంలో నాలుగు మూలలా చిన్న గోపురాలు, వాటిలో బోధిసత్వుని విగ్రహాలున్నాయి. వాటిలో మూడింటిని ఇప్పటికీ మనం చూడవచ్చు. ఈ కట్టడం పైభాగాన గర్భగుడి ఉండేదనీ, ఈ మెట్లమీదగానే ఆలయ ప్రవేశమని అంటారు. ఇప్పుడు గర్భగుడిగానీ, విగ్రహంకానీ ఏమీలేదు. కానీ ఇక్కడున్న విశాలమైన పీఠాన్ని బట్టి ఇక్కడ 75 అడుగుల బుద్ధ విగ్రహం ఉండాలి. ఇప్పుడు ఈ కట్టడం చుట్టూ కలుపుకుంటూ ఏడుసార్లు నిర్మించిన స్థూపాకారం మాత్రం నిలిచిఉంది. ఇప్పటికి 11 విహారాల శిథిలాలు వెలికితీశారు. అన్నీ దాదాపు ఒకే నమూనాలో ఉన్నాయి. దక్షిణదిశగా గదుల మధ్యభాగాన ప్రార్థనా మందిరం ఉంది. ఇక్కడున్న మెట్ల అవశేషాలనుబట్టి ఇది ఒకప్పుడు రెండు, మూడు అంతస్థులతో ఉండేదని తెలుస్తోంది. ఈ హాల్లోనే ఒక మూలగా అష్టభుజాకారంలో బావి నిర్మించారు. ఈ విహారాల్లో ఆచార్యుల పీఠం, భిక్షువుల గదుల అవశేషాలున్నాయి. కానీ అవికూడా ఎన్నోసార్లు పునఃనిర్మించిన చిహ్నాలు మనకు కనిపిస్తాయి. ప్రతి విహారంలోనూ ప్రవేశద్వారానికి పక్కగా ఒక రహస్య ప్రదేశముండేది. ఇక్కడ విలువైన వస్తువులు, భక్తుల కానుకలు భద్రపరిచేవారు. అలాగే ప్రతి విహారంలోనూ ఎదురుగా ఒక మందిరం, బుద్ధ విగ్రహంతో ఉండేది. వీటి అవశేషాలు ఇప్పటికీ మనం చూడొచ్చు. ఇక్కడ కాలిపోయి బొగ్గుగా మారిన కలప, ధాన్యపుగింజలవంటివి చూస్తే ఇక్కడ భయంకరమైన అగ్నిజ్వాల విహారమంతా వ్యాపించినదనిపిస్తుంది. రెండవ మందిరం దగ్గర చాలా శిల్పాలు కనిపించాయి. వీటిని నలంద మ్యూజియంలో చూడొచ్చు.

### నలందా మ్యూజియం

ఇక్కడ తాంత్రికబౌద్ధానికి చెందిన శిల్పాలెన్నో ఉన్నాయి. విహారాల తవ్వకాలో దొరికిన అద్భుతమైన కంచువిగ్రహాలు ఇక్కడ చూడొచ్చు. హైందవ విగ్రహాలు ఇక్కడ లభించడం విచిత్రంగానే ఉంటుంది. నలంద క్షీణదశలో హిందూదేవతలను కించపరుస్తూ విగ్రహాలను మలచే కార్యక్రమం కొనసాగింది. వివిధ ఆసనాలు, ముద్రలు కూడా ఉత్తరకాలంలో శిల్పరీతికంటే విస్తారంగానూ వైవిధ్యంతోనూ కనిపిస్తాయి. కానీ గుప్తుల కాలపు నేర్పు, తీరు ఇక్కడ లేవు. కంచుతో మలిచిన శిల్పాలు ఎక్కువగా కనిపిస్తాయి. బహుశా ఈ కళ ఇక్కడి అధ్యయనంలో ఒక భాగమైఉండొచ్చు. అభ్యసనకాలంలో తయారుచేసినవి కాబట్టే పరిపక్వత లోపించి ఉండొచ్చు. ప్రాచీనబౌద్ధక్షేత్రాలైన సాంచీ, బారహత్



నలందా మ్యూజియంలోని శిల్పం

వంటిచోట్ల బుద్ధుని సాకారమూర్తిగా మలిచే ఆచారం లేదు. ఆయన ఉనికిని సంకేతాల ద్వారా వ్యక్తపరచారు.

ఇక్కడో విశేషం చెప్పాలి. సరస్వతీదేవి హిందువులకెంత ఆరాధ్యదేవతో బౌద్ధులకూ అంతే! ఈ తల్లి విగ్రహం లలితాసనంలో మలచారు. ఇలా ఎన్నో నలంద శిల్పాలను నలంద, పాట్నా మ్యూజియంలో చూడవచ్చు. ఇక్కడ లభించిన నాణాలు, నలంద సుదీర్ఘ ప్రభావాన్ని కళ్లముందు మెరిపిస్తాయి. ఇవి గుప్తవంశానికి చెందిన కుమారగుప్తుడు, నరసింహగుప్తుడు ఆదివరాహుడు గాహద వంశానికి చెందిన గోవిందచంద్రుని కాలంనాటివి.

ఇక్కడకు 400 అడుగుల దూరంలో ఒక మందిరం ఉంది. అక్కడ పద్మాసనంలో మలిచిన బుద్ధవిగ్రహం ఉంది. దీనికి కొద్దిదూరంలో మారీచుని విగ్రహం ఉంది. ఈయన బౌద్ధులకు ప్రభాతదేవత. ఈయనకున్న మూడు తలల్లో ఒకటి పంది తల. కిందనున్న పీఠంమీద ఏడుపందుల శిల్పాలున్నాయి. ఇక్కడ గ్రామస్థులు ఈయనను హిందూదేవతగా కొలుస్తారు.

### బారగావ్

నలందకు సమీపానున్న ఈ గ్రామంలో సూర్యదేవాలయం ఉంది. ఈ మందిరంలో హైందవ, బుద్ధ శిల్పాలు రెండూ కనిపిస్తాయి. ఇక్కడ సుమారు ఐదడుగుల ఎత్తున్న పార్వతీదేవి విగ్రహం సున్నితమైన ముఖకవళికలు, ఆభరణాలతో మనోహరంగా ఉంటుంది. ఇక్కడ లభించిన శిల్పాలన్నింటినీ ఒక గదిలో భద్రపరచారు. వాటిలో శివుడు, పార్వతి, సూర్యుడు, విష్ణువు, అవలోకితేశ్వరుల విగ్రహాలున్నాయి. ఇక్కడికి దగ్గర్లోనే సూర్యకుండం అనే ఒక కొలను ఉంది. ఇక్కడొక ముఖలింగం కూడా ఉంది. నలందకు ఇంత సమీపంలో సూర్యదేవాలయాన్ని చూస్తే టిబెట్టు గ్రంథంలో చెప్పినట్లు యజ్ఞం నిర్వహించిన హిందూ సన్యాసులు ఆ అగ్నిని నలందమీద కుమ్మరించారా అనిపిస్తుంది.

### బేగింపురాం

బారాగావ్, బేగింపురాలమధ్య ఉత్తర దిశగా కొన్ని మట్టిదిబ్బలున్నాయి. ఈ ప్రాంతమంతటా తటాకాలున్నాయి. జనావాసాలకు నీరు అవసరం కదా! కొన్నింటిలో ఇప్పటికీ నీరు ఉంది.

### జగదీశపూర్

బేగింపురా నుండి మరో మూడు కిలోమీటర్ల దూరం వెళ్తే పెద్ద రాతిమీద బుద్ధుడు బోధివృక్షంకింద ధ్యానముద్రలో ఉండగా మారుడు తపోభంగం కలిగించడానికి ప్రయత్నించి పరాజితుడవ్వడం ఘట్టాలుగా మలచారు.

### కుండలపురం

నలందకు ఒక్కటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామం జైన తీర్థంకరుడు మహావీరుని జన్మస్థలమని దిగంబర జైనుల విశ్వాసం. ఇక్కడ కొన్ని జైన దేవాలయాలున్నాయి. రెండు కొలనులు కూడా ఉన్నాయి. వీటిని దుర్గ పుష్కరిణి, పాండవ పుష్కరిణి అంటారు.

★



కూల్‌కూల్‌గా...

# చలువ కళ్లద్దాలు

**ఎండాకాలంలో ఏదోవొక రకంగా మనల్ని ఎండబారి నుండి కాపాడుకునే ప్రయత్నం తీవ్రంగా చేస్తుంటాం. అసలు వీలైనంత వరకు ఎండల్లో బయటికి వెళ్ళకపోవడమే మంచిది. కానీ అలా మనల్ని మనం కట్టడిలో వుంచలేము. ఉద్యోగాలూ, పనులూ, అవసరాలూ మనల్ని ఎండనపడేస్తాయి. కాబట్టి ఎలాగోలా, అది పూర్తయ్యే వరకూ ఎండనుండి కాపాడుకోక తప్పని పరిస్థితి వస్తుంది. సాధారణంగా ఎండకి బాగా ప్రభావితమయ్యేది మన కళ్ళే. వేడికి చర్మం ఇబ్బంది పడితే కాంతికి కళ్లు కలవరపడతాయి. అందువల్ల కళ్ళని ప్రత్యేకంగా కాపాడుకోవడం ముఖ్యం.**

**- డా॥ విజయ్**

**సూ**ర్యకాంతిలోని అల్ట్రావైలెట్ కిరణాలు అటు చర్మాన్ని ఇటు సున్నితమైన రెటీనానీ దెబ్బతీస్తాయి. కాబట్టి ఆ కిరణాల నుండి వాటిని రక్షించుకోవడం తప్పనిసరి. కానీ ఎలా? చర్మానికైతే వస్త్రం తోనో, గొడుగు నీడలోనో, ప్రస్తుతం మార్కెట్లో విరివిగా లభించే అపార క్రీములు, లోషన్ల సంపదతోనో కాస్త రక్షణ పొందవచ్చు. మరి కళ్ళకి కళ్ళజోళ్ళే దిక్కు! కళ్ళద్దాలు (చలువ కళ్లద్దాలు- సన్‌గ్లాసెస్- కూలింగ్ గ్లాసెస్) కూడా ప్రస్తుతం విస్తారంగా లభిస్తున్నాయి. అయినాసరే కాస్త నాణ్యమైనవీ, నిజంగా కంటికి అవసరమైన రక్షణని కల్పించేవాటిని ఎంచుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే 'మంచి' కళ్లద్దాలు కాకపోతే రక్షణమాట అటుంచి కళ్లు దెబ్బతినే ప్రమాదమే ఎక్కువ.

కళ్లద్దాలు మామూలుగా కంటి చూపు సమస్యలను సరిదిద్దడానికి వుపయోగపడతాయి. కానీ సరదాగా, వేరే రంగుతో దృశ్యాలను చూడటం ఎప్పుడో రోమ్ సామ్రాజ్యంలోనే మొదలైంది. నీరో చక్రవర్తి పాలిషు చేసిన పచ్చల (రత్నం) గుండా రోమ్ క్రీడలను చూడటానికి ఇష్టపడే వాడట. క్రీస్తు శకం పన్నెండవ శతాబ్దిలో చైనాలో కాస్త బూడిదరంగు క్వార్ట్జ్‌ని కంటి అద్దాలుగా వాడేవాళ్లు. చైనాలో జడ్జిలు ముద్దాయిలను ప్రశ్నించేటప్పుడు తమ భావాలను తెలియనివ్వకుండా వుండటానికి అటువంటి కంటి అద్దాలను వాడేవాళ్ళట.

ఆ కాలం అద్దాలు కాంతి ప్రభావాన్ని కొంతమేరకు తగ్గించినా సూర్యరశ్మిలో యువి కిరణాల ప్రభావాల్ని మాత్రం ఎదుర్కొనేవి కాదు. అయినా దాదాపు 18వ శతాబ్దం వరకూ కళ్ళద్దాల్లో చెప్పుకోదగ్గ మార్పులేవీ రాలేదు. ఆ శతాబ్దంలో జేమ్స్ అయిస్‌కఫ్ అనే ఆయన రంగుటద్దాలతో ప్రయోగాలు చేయనారంభించాడు.

అయితే జేమ్స్ వాటిని చలువకళ్లద్దాల్లా



పరిగణించలేదు. పచ్చ, నీలం రంగుటద్దాలు కంటి చూపు సమస్యలను పరిష్కరిస్తాయని ఆయన నమ్మేవాడు. పంతొమ్మిదవ శతాబ్దపు చివర్లో సిఫిలిస్ వ్యాధి వచ్చిన వారికి పసుపు కళ్ళద్దాలు వాడమని చెప్పేవాళ్ళు వైద్యులు. ఎందుకంటే ఆ వ్యాధి లక్షణాల్లో కాంతి తీవ్రతను తట్టుకోలేకపోవడం ఒకటి!

కానీ కాంతి త్రీవతను తగ్గించే ప్రయత్నం ఎస్కిమోలు చేశారు. ఎస్కిమోలు నివసించే ధృవప్రాంతంలో తెల్లని మంచువల్ల కాంతి ప్రభావం ఎక్కువ. అందువల్ల వాళ్ళు దంతాల పలకల్లో సన్నని చీలిక చేసి, ఆ పలకల్ని కంటి

అద్దాలుగా వాడేవాళ్లు. సన్నని చీలికలో నుండి కాంతి తక్కువ తీవ్రతతో వచ్చేది. ఈ అలవాటు చరిత్రకు పూర్వం కూడా వుండేదని అంటారు.

ఆధునిక కాలపు చలువ కళ్లద్దాలు చాలా ఫ్యాషన్లలాగే సినిమా వాళ్లనుండే వచ్చాయి. మాకీ రోజుల్లో తక్కువ స్పీడు ఫిల్ము వాడేవాళ్లు. అందువల్ల ఇప్పటికంటే శక్తివంతమైన, ప్రకాశవంతమైన లైట్లను షూటింగులో వినియోగించేవాళ్లు. అటువంటి లైట్ల కాంతిలో పనిచేసిన నటుల కళ్ళు ఎర్రగా వుండేవి. అవి కనిపించకుండా రంగు కళ్లద్దాలు వాడకంలోకి వచ్చాయి. ఆ తరువాత లైట్లు మెరుగైనా, చలువ కళ్లద్దాల వాడకం మాత్రం కొనసాగుతూ వచ్చింది. శామ్ ఫోస్టర్ అనే అతను 1927లో రంగు కళ్లజోళ్లని భారీగా తయారు చేసి న్యూజెర్సీ బీచ్‌లో అమ్మేవాడు.

చలువ కళ్లద్దాల చరిత్రలో మరో కీలక మలుపు పోలరైజేషన్. ఎండ తీక్షణతనుబట్టి అద్దాల రంగు మారే ప్రక్రియ ఇప్పటికీ ఓ అద్భుతమే. అటువంటి అద్భుతాన్ని సుసాధ్యం చేసినవాడు ఎడ్విన్ ల్యాండ్. అతను 1936లో పోలరైజ్డ్ సన్‌గ్లాసెస్‌ని రూపొందించాడు.

అమెరికా సైన్యం కళ్లద్దాల ప్రాముఖ్యతను గుర్తించింది. వెంటనే బాష్ & లాంబ్ అనే అద్దాల కంపెనీకి పైలట్లకు సమర్థవంతంగా ఉపయోగపడే కంటి అద్దాలను చేయవలసిందిగా పురమాయించింది. చాలా ఎత్తులో ఎగురుతున్నపుడు కాంతి ప్రకాశం కంటి చూపుకు ఇబ్బంది కలిగిస్తుంది. అటువంటి సమస్య లేకుండా కంపెనీ నిపుణులు ముదురు ఆకుపచ్చ రంగు అద్దాలను రూపొందించారు. ఆ అద్దాలు పసుపు వర్ణాన్ని శోషించుకుని ఏ ఇబ్బందీ లేకుండా చేస్తాయి.

రే- బాన్ అనే కంపెనీ ఏవియేటర్ సన్‌గ్లాసెస్ అని ప్రత్యేక డిజైనుతో కళ్లద్దాలను తయారు చేసింది. అద్దాలు కాస్త వంపు తిరిగి కిందికి చూస్తున్నా అద్దాల నుండే చూసే వీలుండేలా రూపొందించింది. ఏవియేటర్ డిజైన్ ఈ నాటికీ ప్రజాదరణ పొందుతూనే వుంది. ఆ రోజుల్లో అవి ఎంత ఉపయుక్తంగా వుండేవంటే రెండవ ప్రపంచయుద్ధ కాలంలో ఫైటర్ ప్లేన్ పైలెట్లకు ఆ అద్దాలను ఉచితంగా ఇచ్చేవాళ్లు.

ఇక ఆ తరువాత క్రమక్రమంగా చలువజోళ్ల వ్యాపారం విస్తృత పరిధి ఏర్పరుచుకుంది. అనేక డిజైన్లు వచ్చాయి. చివరికి, ఉపయుక్తంగా వుండడంతో బాటు ఫ్యాషన్‌కి మారు పేరయ్యాయి, స్టైల్‌కి ప్రతిరూపాలయ్యాయి. ఇదే అదనుగా వృద్ధాప్యపు ఆనవాళ్లు కప్పేందుకు, కంటి లోపాల్ని దాచేందుకు కూడా రంగు కళ్లద్దాలే ఆశ్రయమయ్యాయి.

మనలో చాలామంది ఈ నాటికీ రంగు కళ్లద్దాలను ధరించాలంటే మొహమాటపడ్తుంటారు. కానీ ఎండాకాలం కాంతిని తప్పించుకోవాలంటే మాత్రం



బిడియం విడిచి మంచి కళ్లద్దాలు వేసుకోవాల్సిందే. దుమ్ము ధూళి నుండి రక్షణతో బాటు కళ్ళు చిట్లించవలసిన అవసరం కూడా లేకుండా చేస్తాయి కూలింగ్ గ్లాసులు.

కానీ కూలింగ్ గ్లాసులను తీసుకునేటప్పుడు కాస్త నాణ్యమైన వాటిని తీసుకోవడం మర్చిపోవద్దు. రే-బాన్ వంటి మరీ ఖరీదైనవి నిజంగానే చాలా నాణ్యమైనవి. కానీ తక్కువ ధరల్లోనూ మంచివి దొరకొచ్చు.

ఎండాకాలం కళ్లను కాపాడుకుందాం. మంచి చలువ కళ్లద్దాలను వాడదాం.

## కళ్లజోళ్ళు కొనే ముందు...

- మంచి నాణ్యమైన అద్దాలు కానీ, ప్లాస్టిక్ కానీ వుండాలి.
- చౌకబారు జోళ్లతో కంటికి ఇబ్బంది.
- మరీ లేత రంగులో వుండే అద్దాలు అంతగా వుపయోగపడవు.
- రేటీనాని దెబ్బతీయగల యువి కిరణాల నుండి రక్షణ లభించాలంటే కాస్త ముదురు రంగు అద్దాలే మంచివి.
- అయితే అద్దం వల్ల చూపులో ఇబ్బంది లేకుండా వుండాలి.
- ప్రత్యేకించి చిన్నపిల్లల కోసం మరీ చౌకబారు అద్దాలు కొంటుంటారు. అటువంటి వాటితో దృష్టి సమస్యలు రావచ్చు జాగ్రత్త.
- ఫ్యాషన్ కోసం మరీ సన్నగా వుండే ఆకారాలు సరైన రక్షణ ఇవ్వలేవు.
- ఇప్పుడు చాలా మంచి క్వాలిటీ ప్లాస్టిక్ అద్దాలు కూడా లభిస్తున్నాయి. అవి తేలికగా వుండడమే కాకుండా కిందపడినా పగలవు. కానీ గీతలు పడే అవకాశం ఎక్కువ. బాగా గీతలు పడ్డ అద్దాలని వాడకూడదు.
- అయితే ఖరీదైన బ్రాండ్లు కచ్చితంగా మంచివే అనుకోవడానికి లేదు. బహుపరాక్!
- అద్దాలలో నుండి చూస్తే వస్తువులు ఎగుడుదిగుడుగా కనిపించగూడదు.
- అద్దాల ఉపరితలం నునుపుగా, ఎటువంటి ఎత్తు పల్లాలు లేకుండా వుండాలి.

## కొత్త పుస్తకాలు

# నండూరి అక్షర అనంతరంగాలు

**అనంతరంగాలు**
**పేజీలు: 239, వెల: 150/-**
**ప్రతులకు: చినుకు ప్రచురణలు**
**27-28; 3వ అంతస్థు,**
**దత్తాస్ నయాబజార్,**
**రాజ్ యువరాజ్ థియేటర్స్**
**ఎదురుగా, గాంధీనగర్,**
**నిజామాబాద్ 520-003.**

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి ఆర్ధిక సహాయంతో ముద్రితమైన 'అనంతరంగాలు'లో పలు సాహిత్య పరామర్శలు, విశ్లేషణలు, వ్యాస తరంగాలు, గ్రంథ తరంగాలు, ప్రత్యేక తరంగాలు దర్శనమిస్తాయి. దాదాపు 239 పేజీల్లో 51 అంశాలపై నండూరి రాజగోపాల్ రాసిన ఈ గ్రంథంలో చినుకు పత్రిక సంపాదకులుగా సాహిత్యలోకానికి సుపరిచితులు. వివిధ పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాలు కొత్త రచయితలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. జెండాలా ఎగిరిన కవిత్వం -07 (పేజీ73) చాలా మంది కవుల్ని, కవితా సంకలనాన్ని పేర్కొనలేదు. పేరున్న పెద్దలకు పీట వేసినట్లుగా వుంది (ఆంధ్రభూమిలో వ్యాసం).

వార్త 'అనంతం'లో ప్రచురితమైన జాన పదాల జీవనాడి పద విజ్ఞానం (పేజీ.118) చాలా విలువైన సమాచారంతో కూడిన గొప్ప వ్యాసం.

అలాగే "భాషా సాహిత్యాలకు సరిహద్దులు గీయద్దు" (పేజీ144) చక్కటి చర్చనీయాంశ వ్యాసం. తెలంగాణ తొలి వేకువ పెండ్యాల రాఘవ – (పేజీ 139) విశాలాంధ్రలో ప్రచురణ కాబడిన పుస్తక సమీక్ష చాలా బాగుంది. తెలుగు కథాసారాంశం " కాథాంశం" (పేజీ169). ఆంధ్ర భూమి సాహితి పేజీలో 7మే 2007 తేదీన ప్రచురణైన 'సారస్వత సేవలో సాహిత్య పత్రికలు' వ్యాసం ఈ గ్రంథానికే పెద్ద మకుటంగా పేర్కొనవచ్చు (పేజీ-98). 1838లో మొదలైన 'వృత్తాంతి' మొదలు 2006లో ప్రారంభమైన 'కథాకేళి' దాకా సాహిత్య పత్రికల్ని 170 సంవత్సరాల చరిత్రను రికార్డ్ చేశారు. చాలా బాగుంది. అంతర్ బాహ్య సంఘర్షణల మధ్య "చివరకు మిగిలేది" (పేజీ85) నవలపై వ్యాసం సమగ్రంగా ఉంది. పత్రిక మాస పత్రికలో ప్రచురణ అయిన వ్యాసం ఇది. జె.కె. రోలింగ్ సృష్టి హారిపోటర్ (పేజీ83) గురించి రాస్తూ 'బేతాళకథలు, కాశీమజిలీ కథలు, చందమామ కథలు... ఇవన్నీ చదివిన మనకు హారిపోటర్ నవలలోని అంశం కొత్తదేమి కాదు' అంటారు. ఇలాంటి చక్కటి విశ్లేషణలు తెలుగు సాహిత్యంపై రావాలి. రాయాలి. వందేళ్ళ తెలుగు కథ, 137 సంవత్సరాల తెలుగు నవల, 150 సంవత్సరాల తెలుగు నాటక సాహిత్యం మరింత పరిపుష్టం అయి ప్రాచీన హోదాకు అలంకారాలౌతాయి. ప్రతి యువ రచయిత, కవికి చక్కటి కరదీపిక ఈ అనంతరంగాలు.

**- తంగిరాల చక్రవర్తి**

# కిల్లాన 'సమ్మోహన సరాగాలు"

ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ అధ్యక్షులైన ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ "అభినందన" అందించారు. గతంలో కవి కిల్లాన మోహన్ బాబు "స్వాతి చినుకులు" పేరుతో కథల సంపుటిని తెచ్చారు. ఈ గ్రంథంలోనూ కథలు, అంతర్యామి లో ప్రచురితమైన వ్యాసాలు, సరిగమలు, సాహితీ సమీక్షలు, పాటల పల్లకి మొదలగు అంశాలు, కొన్ని ఫోటోలు (సినిమా నటుల నుండి చంద్రబాబు, రోశయ్య లాంటి రాజకీయ నేతలతో) ముద్రించారు. కవి "కిల్లాన" సారస్వత సర్వకళల సమాహారంలా ఈ పుస్తకం "సమ్మోహన సరాగాలు" పలికించయత్నించారు. క్లుప్తత, అనుభూతి, సంఘర్షణ, స్వయం సమగ్రత, సంవాద చాతుర్యం, ఎత్తుగడ, నడక తీరు, ముగింపు, జీవిత సత్యాల అన్వయింపుతో కథలు సాగాయి. ఆంధ్రప్రభ, పత్రిక, భూమి, జ్యోతి, స్వాతి, విపుల, చతుర, విజయ, యువ వంటి వార, మాస పత్రికల్లో అచ్చయిన అనేక ప్రక్రియల్ని ఒకే గ్రంథంగా రూపొందించడం అభినందనీయం... మన ప్రాచీన పురాణ గ్రంథాల్లోని అంశాలకు, సమానత, సేవాదృక్పథ ఆవశ్యకతను చాటే వ్యాస కథలు... విద్యార్థిలోకానికి ఎంతో ఉపకరిస్తాయి. ఉదాహరణకు "అంతా సమానమే" (పేజీ 60), మరుక్షణం మనది కాదు!! (పేజీ 81)లాంటివి. సింహాచలం, సీతాలు పాత్రలు చక్కటి గ్రామీణ వాతావరణ పల్లె ప్రజలకు ప్రతీకలు. తాగుబోతు భర్తతో సీతాలు కాపురం, ప్రాణాలు బలిపెట్టే తీరు 'మంటలు' కథలో పాఠకుల్ని కంటనీరు పెట్టిస్తుంది. సినిమా వారి జీవితాలు తెలిపే "అనుభవం" (పేజీ 36) కథ, దారిద్ర్యం ఎంత దుర్భరమో చెప్పే 'సంతకం' కథ (పేజీ11) పాఠకుల్ని ఆలోచింప జేస్తాయి.

"కవిత రాద్దామంటే కలము పోదేల? కలలు కందామంటే నిదుర రాదేల?" అంటారు కవి. సమాజాన్ని నిద్ర పుచ్చే సాహిత్య సృష్టికన్నా సమాజాన్ని మేల్కొలిపే అభ్యుదయకర సాహితీ సృజన కిల్లాన కలం నుంచి రావాలని ఆశిద్దాం.

**సమ్మోహన సరాగాలు**
**రచన : కిల్లాన మోహన్‌బాబు**
**పేజీలు : 82, వెల: 50/-.**
**ప్రచురణ : కిల్లాన పబ్లికేషన్స్**
**శ్రీరామకృష్ణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్,**
**శ్రీకాకుళం.**

**- తంగిరాల చక్రవర్తి**





# నిత్య యువ్వనుడు

ఆయన వయస్సు ఇప్పుడు 85. కాని ఆయన కుంచె ఇప్పటికీ నవయవ్వన వేగంతో పరుగులు పెడుతుంది. ఆయనే దేశంలో అత్యంత పేరుప్రతిష్టలున్న చిత్రకారుడు కెజి సుబ్రమణియన్. ఆత్మీయులచే మణిదాగా పిలువబడే సుబ్రమణియన్ కేవలం చిత్రకారుడే కాదు, శిల్పి, మ్యూరలిస్టు, ప్రింట్‌మేకర్, రచయిత, విద్యావేత్త. ప్రవేశించిన ప్రతి రంగంలోను ఆయన నిష్ణాతుడుగా పేరుగాంచాడు. ఆ అద్భుత ప్రావీణ్యాన్ని మచ్చుకు చూపించే కొన్ని చిత్రాలను హైదరాబాదులోని, కళాకృతి ఆర్ట్ గ్యాలరీ ఇటీవల ప్రదర్శించింది. 2007, 2008లో సుబ్రమణియన్ కుంచెనుండి జాలువారిన దాదాపు వంద తాజా చిత్రాల సమాహారం ఈ ప్రదర్శన. వీటిలో ఆయన ప్రత్యేకంగా పేరు సంపాదించుకున్న రివర్స్ పెయింటింగ్‌లు కూడ ఉన్నాయి. ఆయన వడి, వేగం కేవలం వాటి రూపకల్పనలోనే కాదు, భావాలను సైతం అంతే వేగంతో పరుగులెత్తించడం ఈ చిత్రాలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చిత్రాలన్నీ ప్రధానంగా స్త్రీ శక్తికి సంబంధించినవి. స్త్రీని దుష్ట సంహారం చేసే కాళికా దేవిగా చూపడమే కాకుండా, సమాకాలీన సమస్యలనూ ఆ చిత్రీకరణలో జోడించడం విశేషం. నేటి సమాజంలో కొనసాగుతున్న అపసవ్యతలకు స్పందనగా చిత్రాలలోని ఆకృతులూ అపసవ్యంగా ఉండటం సుబ్రమణియన్ చిత్రాలలో మరొక విశేషం.

- జి.వి

# దొంగ త్యాగం

చాలాకాలం కిందట ముగ్గురు యువకులు వుండేవారు. వారు చాలా మంచి స్నేహితులు. ఎక్కడికైనాసరే ముగ్గురూ కలిసే వెళ్లేవారు. కలిసే ఆడుకునేవారు. కలిసే అల్లరిచేసేవారు. వారిలో ఒకరు రాజుగారి అబ్బాయి. మరొకరు మంత్రిగారి అబ్బాయి. ఇంకొకరు వ్యాపారి కొడుకు. ముందే చెప్పకున్నాం కదా! ఎప్పడూ ముగ్గురూ కలిసే వుండేవారు. చదువు మీద అస్సలు శ్రద్ధ వుండేదికాదు. అంతేనా! మరే పనీ చెయ్యడానికిగాని నేర్చుకోవడానికిగాని ఇష్టపడేవారు కాదు. అలా కబుర్లతో కాలక్షేపం చేసేవారు.

విషయం మహారాజుగారికి తెలిసింది. తన కుమారుణ్ణి పిల్చుకురమ్మని మనిషిని పంపాడు. యువరాజు వచ్చాడు.

రాజుగారు కోపంగా మొహం పెట్టి "నువ్వు సమయం అంతా వృధా చేస్తున్నావు. మార్గం మార్చుకో. లేదా జీవితం నాశనమౌతుంది" అని హెచ్చరించి పంపాడు.

మంత్రిగారికి కూడా కుమారుడి విషయం తెలిసి పిలిపించాడు.

"నువ్వు సమయం అంతా వృధా చేస్తున్నావు. మార్గం మార్చుకో. లేదా జీవితం నాశనమౌతుంది" అని హెచ్చరించి పంపాడు.

వ్యాపారికి కూడా విషయం తెలిసి కుమారుడి కోసం మనిషిని పంపి పిలిపించాడు.

"నువ్వు సమయం అంతా వృధా చేస్తున్నావు. మార్గం మార్చుకో. లేదా జీవితం నాశనమౌతుంది" అని హెచ్చరించి పంపాడు.

ఆ తర్వాత ముగ్గురు మిత్రులూ కలుసుకున్నారు.

"మా నాన్నగారు నన్ను పిల్చి పద్ధతి మార్చుకోమన్నారు" అన్నాడు రాకుమారుడు.

"మా నాన్నగారు కూడా అదే చెప్పాడు" అన్నాడు మంత్రి కుమారుడు.

"నాక్కూడా మా ఇంట్లో అలాగే చెప్పారు. అంతేకాదు! నేను కనుక మారకపోతే నన్ను ఇంట్లోంచి బయటకు పంపేస్తానన్నారు" వ్యాపారి కొడుకు ఏడుపుమొహం పెట్టుకొని అన్నాడు.

"ఇదేం బాలేదు. అసలు కన్నతండ్రులే ఇలా అవమానించాక మనం ఇంకా ఇంట్లో ఎందుకుండాలి? వెళ్లిపోదాం!" అన్నాడు రాజు కొడుకు.

"మనం ఎలా వెళ్లగలం? మనదగ్గర అస్సలు డబ్బే లేదుకదా" అన్నాడు మంత్రి కుమారుడు.

"ఇప్పడు మనకు ఒకటే దారి వుంది. మనం సొంతగా డబ్బు సంపాదించాలి" అన్నాడు వ్యాపారి కొడుకు.

"ఎలా?" అని ముగ్గురూ వివరీతంగా ఆలోచించసాగారు.

"ఆ...ఇక్కడకు చాలా దూరంగా ఒక పర్వతం వుంది. అక్కడ ...అంటే పర్వతం పైభాగాన విలువైన వజ్రాలు, మణులు దొరుకుతాయంట. ఎవరో చెప్తుంటే విన్నాను. అక్కడికి వెళ్దామా?" అన్నాడు వ్యాపారి కొడుకు.

"ఆ...అలాగైతే వెంటనే మనం పర్వతం దగ్గరకు వెళదాం పదండి. అక్కడ కనుక మనం వజ్రాలు సంపాదించగలిగితే మనం మన తండ్రుల మీద ఆధారపడాల్సిన అవసరమే లేదు" అన్నాడు రాజు కుమారుడు పౌరుషంగా.

ముగ్గురికీ ఈ ఆలోచన నచ్చింది. వెంటనే ముగ్గురూ కలిసి పర్వతాన్ని వెతుక్కుంటూ బయలుదేరారు. పేద్ద నది దాటారు. చీమలు దూరని చిట్టడవి దాటారు. చివరికి వారు అనుకున్న పర్వతం దగ్గరకు చేరారు. ముగ్గురికీ విలువైన వజ్రాలు దొరికాయి. చాలా సంతోషించారు. ఆ ఆనందం పట్టలేక పేద్దగా కేకలు వేశారు. వెంటనే ఇంటికి వెళ్లాలనుకున్నారు. అయితే మార్గమధ్యలో దొంగలుంటారని వ్యాపారి కొడుకు చెప్పాడు. దాంతో వారు ఆలోచనలో పడ్డారు.

(మరి వజ్రాలు తీసుకొని వారు జాగ్రత్తగా ఇంటికి చేరగలిగారా? మార్గమధ్యలో దొంగలు ఎవరైనా వారిని అడ్డగించారా? ఏమైందనేది తెలియాలంటే వారం రోజులు వేచి చూడాల్సిందే)

-చూటీ